మెట్రో కెమ్ ఫార్మాలో అగ్ని ప్రమాదం

- ఈటీపీ భవనం మూడో అంతస్థులో వేస్ట్ నుంచి రాజుకున్న మంటలు
- దెబ్బతిన్న భవనం, రూ.లక్షల్లో ఆస్తి నష్టం



....మెయిన్‌లో

ఆర్టీసీ ఆదాయం అదుర్స్

అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు సంక్రాంతికి రూ.కోటి పైచిలుకు అదనంగా రాబడి

- 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రూ.3.33 కోట్ల ఆదాయం
- 20వ తేదీన రికార్డుస్థాయిలో రూ.45 లక్షలు..
- సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు
- 119.32 ఆక్యుపెన్సీ రేషియోతో రాష్ట్రంలో మొదటిస్థానం



నర్సీపట్నంలో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



కె.పద్మావతి, డీపీటీవో

అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోలకు ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కోటి రూపాయల అదనపు ఆదాయం వచ్చిందని డీపీటీవో కె.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ సోమవారం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 119.32 శాతంతో అనకాపల్లి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. సంక్రాంతి పండుగకు ముందు, తరువాత అనకాపల్లి డిపో నుంచి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, పాయకరావుపేట, విజయనగరం, అన్నవరం, తదితర ప్రాంతాలకు సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. నర్సీపట్నం డిపో నుంచి హైద్రాబాద్, విశాఖపట్నం, తుని, చింతపల్లి, విజయవాడలకు ప్రత్యేక బస్సులు నడిపినట్టు చెప్పారు. సాధారణంగా సోమవారం అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి రోజుకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆదాయం వస్తుందని, అయితే 20వ తేదీ (సోమవారం) ఏకంగా రూ.45 లక్షల ఆదాయం వచ్చిందని ఆమె వెల్లడించారు. రెండు డిపోల్లో 180 బస్సులు వున్నాయని, సాధారణంగా 64 వేల కిలోమీటర్లు తిరుగుతాయని, అయితే సోమవారం అదనపు సర్వీసులతో కలిపి 70 వేల కిలోమీటర్లు తిరిగాయని చెప్పారు. ఒక్కొక్క బస్సు సగటున 389 కిలో మీటర్లు తిరిగిందని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా అనకాపల్లి, నర్సీపట్నం డిపోల ద్వారా ఈ నెల పదో తేదీన రూ.40 లక్షలు, 11వ తేదీన రూ.32 లక్షలు, 12వ తేదీన రూ.33 లక్షలు, 13వ తేదీన రూ.26 లక్షలు, 14వ తేదీన రూ.17 లక్షలు, 15వ తేదీన రూ.20 లక్షలు, 16వ తేదీన రూ.28 లక్షలు, 17వ తేదీన రూ.28 లక్షలు, 18వ తేదీన రూ.32 లక్షలు, 19వ తేదీన రూ.30 లక్షలు, 20వ తేదీన రూ.47 లక్షలు.. మొత్తం రూ.3.33 కోట్ల ఆదాయం లభించిందన్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవీంద్ర రాక

చోడవరం మండలంలో పర్యటన

అనకాపల్లిలో అధికారులతో సమీక్ష

అనకాపల్లి/ చోడవరం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం జిల్లాలో పర్యటించనున్నారని టీడీపీ జిల్లా అధ్య క్షుడు బత్తుల తాతయ్యబాబు తెలిపారు. ఉదయం విశాఖ నుంచి రోడ్డు మార్గంలో చోడవరం చేరుకొని, తొలుత రైతు బజార్‌ను సందర్శించి, అసంపూర్తిగా వున్న తహసీల్దార్ కార్యాలయం భవనాలను పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లి స్థితిగతులపై సమీక్షిస్తారని, అక్కడి నుంచి గంధవరం వెళ్లి నిర్మాణంలో ఉన్న విత్తన గిడ్డంగి పనులను పరిశీలి స్తారన్నారు. మధ్యాహ్నం అనకాపల్లి చేరు కుని కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షునిగా ద్వారపురెడ్డి

- వరుసగా రెండోసారి ఎంపికైన పరమేశ్వరరావు



మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కొత్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా ద్వారపురెడ్డి పరమేశ్వర రావు వరుసగా రెండోసారి నియమి తులయ్యారు. అనకాపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి బుద్ద లక్ష్మీనారాయణ, పరిశీలకులు ఎ.కేశవ ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన బాధ్యతను శక్తివంచన లేకుండా నెరవేరుస్తానని, జిల్లాలో బీజేపీని ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

ఏవోబీపై చలపతి ముద్ర

మావోయిస్టు నేతకు ఉమ్మడి విశాఖ జిల్లాతో విడదీయరాని బంధం

- 1998లో ఈస్ట్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా ప్రస్థానం
- అనకాపల్లి, చోడవరం పోలీస్ స్టేషన్లపై దాడికి నేతృత్వం
- ఏజెన్సీతోపాటు ఒడిశాలో పోలీసు అవుట్‌పోస్టులపైనా దాడులు
- రామగూడ ఎన్‌కౌంటర్ తరువాత పెరిగిన పోలీసుల నిర్బంధం
- ఏవోబీ నుంచి చలపతి సహా ముఖ్య నేతలు ఛత్తీస్‌గఢ్‌కు... అక్కడి నుంచే కార్యకలాపాలు
- 2018లో అరకు ఎమ్మెల్యే కిడారి, మాజీ ఎమ్మెల్యే సోమ హత్యలో కీలకపాత్ర వహించినట్టు పోలీసుల ప్రకటన
- ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పని చేస్తూ ఎన్‌కౌంటర్‌లో మృతి



మావోయిస్టు అగ్రనేత చలపతి (ఫైల్)

పాడేరు/సీలేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):

ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ అగ్ర నేత ప్రతాపరెడ్డి రామచంద్రారెడ్డి అలియాస్ చలపతికి ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీతో విడదీయరాని బంధం ఉంది. ప్రస్తుతం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుత అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో గతంలో పలు దాడులకు నేతృత్వం వహించారు. ఆరున్నరేళ్ల క్రితం డుంబ్రిగుడ మండలంలో నాటి ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమల దారుణ హత్యలకు చలపతి సూత్రధారిగా పోలీసులు చెబుతుంటారు.



ఎదురు కాల్పుల్లో మృతిచెందిన చలపతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి నాలుగున్నర దశాబ్దాల క్రితం నక్సల్‌బరీ ఉద్యమంలోకి వచ్చారు. రెండున్నర దశాబ్దాల నుంచి ఉత్తర కోస్తాతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. 1998లో తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలకు విస్తరించి ఉండే పీపుల్స్‌వార్ గ్రూపు ఈస్ట్ డివిజన్ కమిటీకి సుధాకర్ పేరిట చలపతి కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలో ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా జాన్‌బాయ్, మల్లెగూడ పోలీస్ అవుట్ పోస్టులపై దాడికి నాయకత్వం వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా జీకే వీధి మండలం ధారకొండ అవుట్ పోస్టుపైన, కోరాపుట్ జిల్లా ఆర్.ఉదయగిరి పోలీస్ స్టేషన్‌పైన దాడి చేసి ఆయుధాలను ఎత్తుకుపోయారు. తరువాత ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి, చోడవరం పోలీస్ స్టేషన్లపై నక్సలైట్లు దాడి చేసి, పెద్దఎత్తున ఆయుధాలను ఎత్తుకుపోయారు. ఈ దాడికి వ్యూహకర్తగా చలపతి వ్యవహరించారు. అలాగే దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన బలిమెల జలాశయంలో గ్రేహౌండ్స్ బలగాలు ప్రయాణిస్తున్న లాంచీపై దాడి ఘటనలో చలపతి సూత్రధారి. ఈ ఘటనలో 30 మందికిపైగా పోలీసులు మృతిచెందారు. బలిమెల జలాశయంలో జాన్‌బాయ్ వద్ద స్పీడ్ బోట్లపై గస్తీ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ పోలీసులపై దాడి, మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ వినీల్ కృష్ణ కిడ్నాప్‌లో చలపతి కీలకంగా వ్యవహరించారు. అప్పటి నుంచి ఆయన కోసం ఇరురాష్ట్రాల పోలీసు బలగాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. పలుమార్లు పోలీసుల ఎదురుకాల్పుల నుంచి తప్పించుకున్నారు.

ఈ నేపథ్యంలో 2015 అక్టోబరు 24న ఏవోబీలోని ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా రామగూడ ... మిగతా 8వ పేజీలో

పల్లె పండుగ పనులు వేగవంతం

వచ్చే నెల మొదటి వారానికల్లా పూర్తి చేయాలి

- ఉపాధి కూలీలకు 100 రోజులు పని
- లక్ష్యాలకు అనుగుణంగా గృహ నిర్మాణాలు
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు
- ఆయా శాఖల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు విజయకృష్ణన్ తదితరులు

అనకాపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటినీ వచ్చే నెల మొదటి వారంనాటికి పూర్తిచేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాలవారీగా మంజూరైన పనులు, పూర్తయిన పనులు, బిల్లులు మంజూరు, పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే మంజూరైన రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు పూర్తిచేసిన తరువాతనే కొత్త పనులకు ప్రతిపాదనలు పంపించాలని స్పష్టం చేశారు.

ప్రతి కుటుంబానికి 100 రోజులు పని

ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు వున్న ప్రతి కుటుంబానికి వంద రోజులపాటు పనులు కల్పించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ, మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టిన పనులను త్వరగా ... మిగతా 8వ పేజీలో

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

గతంతో పోలిస్తే నెల రోజులకుపైగా ఆలస్యం

- వర్షాలు, కార్మికుల సమ్మె, సంక్రాంతి పండుగ కారణమంటున్న అధికారులు
- లక్షా 30 వేల టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యమని ఎండీ వెల్లడి



కేన్ క్యారియర్ వద్ద చెరకు

చోడవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఎట్టకేలకు మంగళవారం రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభమైంది. ఇందుకోసం సోమవారం నుంచే ఫ్యాక్టరీకి చెరకు రాక ప్రారంభమైంది. మంగళవారం ఉదయం క్రషింగ్‌కు శ్రీకారం చుట్టారు. వాస్తవంగా డిసెంబరు మొదటివారంలో క్రషింగ్ సీజన్ ప్రారంభం కావాలి. అయితే ఈ ఏడాది తీవ్రవ ఆర్థిక సమస్యల కారణంగా క్రషింగ్‌పై నీలినీడలు అలముకున్నాయి. సాధారణ సమయంతో పోలిస్తే ఈసారి పక్షం రోజులు ఆలస్యంగా గత నెల 25వ తేదీన ఫ్యాక్టరీ ఎండి సన్యాసినాయుడు, చెరకు గడలను కేన్ క్యారియర్‌లో వేసి క్రషింగ్‌ను లాంచనంగా ప్రారంభించారు. అయితే అంతకుముందు వరకు వర్షాలు పడడంతో చెరకులో రసనాణ్యత పూర్తిస్థాయిలో వుండదన్న ఉద్దేశంతో రెగ్యులర్ క్రషింగ్‌ను వెంటనే ప్రారంభించలేదు. తరువాత వేతన బకాయిల కోసం కార్మికులు ఆందోళనకు దిగడం, సంక్రాంతి పండుగ రావడంతో క్రషింగ్ మరికొంత కాలం ... మిగతా 8వ పేజీలో

సమర్థంగా పనిచేశాననే సంతృప్తితో వెళుతున్నా

జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్

- ఈ ఆరు నెలల్లోనే నగర పాలక సంస్థకు రూ.110 కోట్ల మేర ఆదాయం పెంపునకు కృషి
- ఓపెన్ స్పేస్‌ల పరిరక్షణకు చర్యలు
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా జీవీఎంసీని తీర్చిదిద్దేందుకు ప్రణాళిక
- స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో మంచి ర్యాంకు లభించేలా నగరాన్ని సిద్ధం చేశాం



విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): **ఆరు నెలల కాలంలో జీవీఎంసీకి అదనంగా రూ.110 కోట్ల ఆదాయం పెరిగేలా కృషిచేశానని కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న పి.సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్‌గా తాను సమర్థంగా పని చేశాననే సంతృప్తితో వెళుతున్నానన్నారు. నివాస కేటగిరీలో ఉంటూ వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వాటిని కమర్షియల్ అసెస్‌మెంట్‌గా మార్చి ఆ మేరకు పన్ను విధించడం, అదనపు అంతస్థులు నిర్మించిన వారికి పన్ను పెంపు ద్వారా జీవీఎంసీకి ఆస్తి పన్ను డిమాండ్‌ను రూ.30 కోట్లు పెంచామన్నారు. అలాగే పరిశ్రమలకు నీటి చార్జీలను పెంచడం ద్వారా రూ.80 కోట్లు అదనపు ఆదాయం వచ్చేలా చేశానన్నారు. దీనివల్ల జీవీఎంసీకి ఏటా రూ.110 కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందన్నారు.**

నగర పరిధిలోని గెడ్డల్లో చెత్త పడేస్తుండడం వల్ల ఎప్పటికప్పుడు పూడిక తీయాల్సి వస్తున్నదని, ఈ నేపథ్యంలో 300 కిలోమీటర్లు పొడవున గెడ్డలకు ఇరువైపులా మూడు మీటర్లు ఎత్తున ఇనుప మెష్‌లు ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు రూపొందించానన్నారు. దీనికి సంబంధించిన అంచనాల తయారీ పూర్తయిందన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో ఉన్న 1200 ఓపెన్ స్పేస్‌ల పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులను తీసుకువచ్చి పచ్చదనం పెంపొందించడంతోపాటు భవిష్యత్తులో కబ్జాలకు గురికాకుండా ఓపెన్ స్పేస్‌ల వద్ద బోర్డులు ఏర్పాటుచేయబోతున్నామన్నారు. అదేవిధంగా ... మిగతా 8వ పేజీలో



గోవాడ పరిధిలోని కొండవాలు ప్రదేశంలో గ్రావెల్ తవ్వకాలు

కొండలకు తూట్లు

చోడవరం మండలంలో అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు

- అభివృద్ధి పనుల మాటున పక్కదారి
- చోద్యం చూస్తున్న అధికారులు

చోడవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కొద్దిరోజులుగా అనధికార గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ప్రధానంగా ముద్దుర్తి, గోవాడ, బెన్నవోలు గ్రామాల పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వి, తరలించుకు పోతున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరుతో గ్రావెల్ తవ్వకాలు మొదలుపెడుతున్న అక్రమార్కులు అనంతరం ప్రైవేటు అవసరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటు న్నారు. ఇళ్లనిర్మాణాల్లో పునాదుల ఫిల్లింగ్, ఖాళీ స్థలాలు, ప్రైవేటు లేఅవుట్‌లలో స్థలాలను ఎత్తు చేయడానికి గ్రావెల్ సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారం అంతా రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము వరకు సాగుతున్నది. దీంతో రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. చోడవరం-అనకాపల్లి, వెంకన్న పాలెం-సబ్బవరం మార్గాల్లో రాత్రిపూట నిఘాపెడితే గ్రావెల్ రవాణా చేసే వాహనాలు పట్టుబడతాయని, కానీ ఆ దిశగా నియంత్రణ శాఖల అధికారులు చర్యలు చేపట్టడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ రాంబిల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

రాంబిల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఉన్న కంపెనీలు, గ్రామాల్లోని పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది సమయ పాలన, నిబద్ధత కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట రాంబిల్లి సర్కిల్ సీఐ నర్సింగరావు, ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది వున్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి: ఎలమంచిలి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లను మంగళవారం పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాలు, ప్రమాదాల గురించి ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణ బస్టాండ్ జంక్షన్ పరిసరాలను పరిశీలించి సీఐ ధనుంజయరావుకు ట్రాఫిక్‌పై పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎస్‌ఐలు సావిత్రి, ఉపేంద్ర వున్నారు.

నేడు లాలంకోడూరులో ఎరికిరెడ్డి నాయుడు, ఆదమ్మల తీర్థం



లాలం ఎరికిరెడ్డి, ఆదమ్మ విగ్రహాలు

రాంబిల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : లాలం కోడూరులో బుధవారం లాలం ఎరికిరెడ్డి నాయుడు, ఆదమ్మ తీర్థాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఏటా ఎరికిరెడ్డి నాయుడు, ఆదమ్మల తీర్థాన్ని వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాంబిల్లి మండలంలో ఇదే పెద్ద తీర్థం కావడం విశేషం. పలు వైద్య శిబిరాలు, క్రీడా పోటీలు, పలు రకాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల డైరీ ఆవిష్కరణ

అచ్యుతాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల డైరీతో పాటు క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డివిజన్ కార్యదర్శి శశిధర్, జిల్లా సహాయ కార్యదర్శి సింహాచలం నాయుడు, వెంకటరావు, శ్రీనివాసరావు, చిన ప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అందుబాటులోకి స్వీపింగ్ మెషీన్



ఎలమంచిలి రైల్వే స్టేషన్ ప్రధాన రోడ్డును శుభ్రం చేస్తున్న స్వీపింగ్ మెషీన్

ఎలమంచిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పట్టణ రోడ్లపై మంగళవారం స్వీపింగ్ మెషీన్ల సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చొరవ చూపి ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించడంతో దీనికి కదలిక వచ్చింది. సుమారు మూడేళ్ల క్రితం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీకి ఈ యంత్రం మంజూరైంది. ప్రారంభంలో మాత్రమే పనిచేసిన ఈ యంత్రాన్ని అధికారులు షెడ్డుకు పరిమితం చేశారు. గత నెలలో మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో స్వీపింగ్ మెషీన్ అంశాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ లేవనెత్తారు. రోడ్లను శుభ్రం చేసే మెషీన్ ఉందా?, లేదా? అని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావును ప్రశ్నించారు. వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలు మేరకు మంగళవారం ఈ స్వీపింగ్ మిషను సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో రైల్వే స్టేషన్ రోడ్డుపై ఈ మెషీన్ పనులు ప్రారంభించారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు

» విజేత ఎలమంచిలి కర్రి నాయుడు



ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కొత్తపాలెంలో మంగళవారం ఎడ్ల బండ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎడ్ల బండ్ల పరుగు పోటీలతో పాటు మహిళలకు కుర్చీల ఆట, పరుగు పందెం, చెట్టు భజనలు, కోలాటం వంటి పోటీలు నిర్వహించారు. సుమారు గంటన్నర పాటు నిర్వహించిన ఎడ్ల బండ్ల పరుగు(రజా) పోటీలను వీక్షించేందుకు స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం ఎలమంచిలికి చెందిన రైతు కర్రి నాయుడు, ద్వితీయ స్థానం కొత్తపాలేనికి చెందిన రాపేటి రామకృష్ణ, తృతీయ స్థానం సోమలింగపాలేనికి చెందిన పిల్లా చిరంజీవి కైవసం చేసుకున్నారు. వీరితో పాటు మరికొంత మంది రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఆడారి అప్పారావు, దాడి చంద్రశేఖర్, పిల్లా ఆదిబాబు, ఆడారి సన్యాసినాయుడు, రాపేటి పైడినాయుడు, కొయిలాడ సన్యాసినాయుడు, ఆడారి జగన్నాథరావు, వెంకట్ పాల్గొన్నారు.

వంతెనపై రంధ్రం.. ఆదమరిస్తే ప్రమాదం

» వాడనర్సాపురం ప్రభుత్వ పాఠశాల వద్ద పరిస్థితి దారుణం

» ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు

» రంధ్రాన్ని కర్రలతో మూసి గోనె సంచి కప్పిన స్థానికులు

» రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు





మినీ వంతెన మధ్యలో పడిన రంధ్రం, పక్కన ఆ రంధ్రంలో కర్రలు వేసి, గోనె సంచి కప్పిన దృశ్యం

రాంబిల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురం గ్రామంలో రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే మినీ వంతెనపై రంధ్రం పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని వాడనర్సాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల గెడ్డపై ఉన్న మినీ వంతెనకు రంధ్రం పడి నాలుగు నెలలు దాటుతోంది. ఇది ప్రమాదకరంగా ఉండడంతో వాహనచోదకులు జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈ వంతెన మీదుగానే ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రానికి బాలలు వెళుతుంటారు. వంతెనపై పడిన రంధ్రం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

దీంతో స్థానికులు ఆ రంధ్రంలో కర్రలు వేసి గోనె సంచి కప్పేశారు. అయితే రాత్రి వేళల్లో దీనిని గమనించని వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రంధ్రాన్ని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక

» జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ పూర్ణిమాదేవి



మాట్లాడుతున్న పూర్ణిమాదేవి

ఎస్.రాయవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 నిధులతో చేపట్టాల్సిన పనులపై జిల్లాలో ప్రతీ పంచాయతీకి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి తెలిపారు. ఆమె మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను వ్యవసాయ రైతులకు ఉపయోగపడే విధంగా దృష్టి సారించినట్టు చెప్పారు. ప్రధానంగా గోకులం షెడ్ల నిర్మాణం, ఫిష్ పాంట్స్, మినీ చెరువుల ఏర్పాటు, పంచాయతీలో ఉన్న సుమారు పది ఎకరాల్లో ట్రెంచ్‌ల తవ్వకం వంటి పనులు చేస్తామన్నారు. ఎస్.రాయవరం మండలంలో రూ.10 కోట్ల నిధులతో కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు రూ.2 కోట్ల నిధులతో 96 గోకులం షెడ్లను నిర్మిస్తామన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో ఎరకయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రజా వేదికలో పలు తేడాల గుర్తింపు



ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రజా వేదికలో బోర్డు ఏర్పాటు కోసం ప్రశ్నిస్తున్న గణపతిరాజు

ఎస్.రాయవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజా వేదికలో భాగంగా చేపట్టిన సామాజిక తనిఖీల్లో అధికారులు పలు తేడాలను గుర్తించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మల ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మండలంలో 2023-24 ఏడాదికి గాను ఖర్చు చేసిన రూ.16 కోట్ల 78 లక్షల 97 వేల నిధులకు సంబంధించి జరిగిన పనులు, ఖర్చులపై అన్ని పంచాయతీల్లో జరిగిన ఆడిట్‌లో పలు లోటుపాట్లను పరిశీలించారు. ఇందు లో మస్టర్‌పై కొట్టి వేతలు, కొలతల్లో తేడాలు, రింగ్ ట్రెంచులు దున్ని వేయడం వంటి తేడాలను అధికారులు గుర్తించారు. వాటికి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ల, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు పెనాల్టీలు వేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై వారిని పూర్ణిమాదేవి హెచ్చరించారు. లింగరాజుపాలెంలో జరిగిన పనుల వద్ద బోర్డులను ఏర్పాటు చేయలేదని ఆ గ్రామానికి చెందిన డి.గణపతిరాజు అధికారుల దృష్టికి తీసుకురావడంతో సంబంధిత సిబ్బందిపై పూర్ణిమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్‌ఆర్‌పీ రాజేంద్ర, ఏపీవో ఎరకయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



తాండవ షుగర్స్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక నాయకులు

తాండవ షుగర్స్ కార్మికుల జీతాల బకాయిలు చెల్లించాలి

» ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మిక నాయకుల ఆందోళన

పాయకరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తాండవ షుగర్స్ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని పలువురు కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పలువురు నాయకులు, కార్మికులు పట్టణంలో ఫ్యాక్టరీ గేటు ఎదుట ఈ మేరకు డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బి.వెంకటరమణ, వి.రఘురామరాజు, తదితరులు మాట్లాడుతూ తాండవ షుగర్స్‌లో క్రషింగ్ నిలిచిపోయి నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటికీ కార్మికుల జీతాలు చెల్లించకపోవడం వల్ల వారంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిపివేయడంతో కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే స్పందించి తాండవ షుగర్స్ కార్మికులకు చెల్లించాల్సిన రూ.13.5 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులు ఫాక్టరీ ఎండీ ప్రసాదరావును కలిసి జీతాల బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు పదవి విరమణ చేసిన కార్మికులకు హైయ్యర్ పెన్షన్ బెనిఫిట్ కోసం సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వర్రే విష్ణు, పక్కుర్తి కొండబాబుతోపాటు పలువురు కార్మికులు, విశ్రాంత కార్మికులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా చెల్లించాలంటూ నిరసన



తీరం వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

నక్కపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట తీరంలో మంగళవారం మత్స్యకార యువకులు మత్స్యకార భరోసాను ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అందజేయాలని కోరుతూ నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకార భరోసా రూ.10 వేలు నుంచి రూ. 20వేలు ఇస్తామని చెప్పిన మాట నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.మహేశ్‌బాబు, సీహెచ్ కాశీ, జీ సోమేశ్వరరావు, ఎం.రాము, బీ నూకరాజు పాల్గొన్నారు.

అపరాల సాగుపై రైతులకు అవగాహన

నక్కపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అపరాల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై మంగళవారం కాగిత, వేంపాడు గ్రామాల్లో రైతులకు ఏవో ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నక్కపల్లి మండలంలో 950 ఎకరాల్లో అపరాలను రైతులు సాగు చేస్తున్నారని ఆయన చెప్పారు. కలుపు మొక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, రాజేశ్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట రూరల్: రైతులు అపరాల సాగులో సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో పి.ఆదినారాయణ తెలిపారు. మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కల్పన, రూప, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లాలంకోడూరులో..

రాంబిల్లి: మండలంలోని లాలంకోడూరు గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారిణి సి.సుమంత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కొబ్బరి, జీడి తోటల్లో యాజమాన్య పద్ధతులు, కొబ్బరి చెట్ల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ రాజు, వీఏఏ కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



నక్కపల్లి మండలంలో అపరాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమాప్రసాద్

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

» ఒకరిని కేజీహెచ్‌కి తరలింపు

కోటవురట్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కైలాసపట్నం సమీపంలో మంగళవారం రాత్రి రెండు బైకులు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గొలుగొండ మండలం పాకలపాడు గ్రామానికి చెందిన గంప దినేశ్, పెదపూడి మోహన్‌కృష్ణ, కిశోర్ ఒకే బైక్‌పై ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్రస్నానాలు వెళ్లి తిరిగి వస్తున్నారు. కోటవురట్ల మండలం చౌడువాడ గ్రామానికి చెందిన కరిడ్ల గణేశ్ బైక్‌పై వస్తుండగా కైలాసపట్నం సమీపంలో ఈ రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గణేశ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు.

విస్తృతంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు



కట్టుబోలులో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి రఘునాథ్

రాంబిల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పాడి రైతులు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాంబిల్లి పశువైద్యులు డాక్టర్ రఘునాథ్ కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కట్టుబోలు, దిమిలి గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రఘునాథ్ సిబ్బందితో కలిసి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు నట్టనివారణ మందులను అందజేశారు. కోళ్లకు తెగుళ్లు రాకుండా టీకాలు వేశారు. పాడి రైతులకు మందులను అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచదార్ల పశు వైద్యాధికారిని డాక్టర్ మాధురి, మండల యానిమల్ అసిస్టెంట్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట రూరల్: ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ జి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పాల్తేరు, ఎస్.నర్సాపురం గ్రామాల్లో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఆడారి సాయిశంకర్, గుప్తా పశువులకు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యండపల్లిలో...

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. తంగేడు డాక్టర్ ప్రతాప్ మండలం లోని యండపల్లిలో శిబిరాన్ని ప్రారంభించారు.

ఖాజీపాలెంలో...

అచ్యుతాపురం: ఖాజీపాలెంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఎనిమిది ఎదకురాని పశువులకు, మూడు పశువులకు చూడి పరీక్షలు, 80 పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. 40 కోళ్లకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరం వల్ల ఖాజీపాలెంలో 80 మంది రైతులు లబ్ధి పొందారని పశువైద్యాధికారి జగదీశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి పి.తులసీరామ్, సర్పంచ్ పి.నర్సింగరావు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఉత్సవం



ఉద్దండపురంలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి వెళ్లిన వారం రోజుల్లో ఆంజనేయస్వామి జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వారి మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారి ఉత్సవమూర్తి ఊరేగింపు తిరువీధుల్లో ఘనంగా సాగింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధుల నేతృత్వంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. బాణసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'సబ్సిడీ రుణాలకు పేర్లు నమోదు చేయించుకోండి'

ఎలమంచిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలో ఉన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు త్వరలో ప్రభుత్వం మంజూరు చేయనున్న ఎస్సీ బీసీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు మీ సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు మెప్మా సీఎంఎం డి.పద్మావతి 7901610061 ఫోన్ నంబరును సంప్రతించాలన్నారు.

సోమలింగపాలెంలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారం

ఎలమంచిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని సోమలింగపాలెంలో ఎట్టకేలకు లోఓల్టేజ్ సమస్య పరిష్కారమైంది. మంగళవారం విద్యుత్ శాఖ ఏఈ కనకరాజు ఆధ్వర్యంలో సిబ్బంది కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో తమకు విద్యుత్ కష్టాలు తీరాయని వినియోగదారులు ఆనందం వ్యక్తం చేశారు.

గాజువాక రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం

అచ్యుతాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్ గాజువాక రోడ్డులో రెండు లారీలు ఒకేసారి మరమ్మతుకు గురై నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గాజువాక నుంచి అచ్యుతాపురం వైపు వస్తున్న రెండు లారీలు అచ్యుతాపురం జంక్షన్‌కు సుమారు ఐదు వందల మీటర్ల దూరంలో మరమ్మతులకు గురై నిలిచిపోయాయి. దీంతో గాజువాక రోడ్డులో సుమారు కిలోమీటరు వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సెజ్ కర్మాగారాల్లో పని చేసే ఉద్యోగులను తీసుకువచ్చే బస్సులు, యంత్రాలను తీసుకు వచ్చే వాహనాలతో పాటు ఇతర వాహనాలు కూడా భారీ స్థాయిలో నిలిచిపోయాయి. కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లడానికి వీలులేకపోవడంలో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు గంట సేపు కష్టపడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

'30న డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలి'

పాయకరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి మద్దతుగా ఈ నెల 30న కాకినాడ జిల్లా తునిలో నిర్వహించే డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పెదపూడి గవరయ్య కోరారు. మంగళవారం పాయకరావుపేటలో దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించిన పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పుల ప్రదర్శనతో ఈ మేరకు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరుగుల మోషే, డొక్కా అజయ్‌బాబు, తుమ్మలపల్లి సతీష్, అనంతపురం రాజు, ఎం.నూకరాజు, ఎస్.విష్ణు, ఆరుగుల కృష్ణ, అనంతపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు కృషి వల్లే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా'



మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి వల్లే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా వచ్చిందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పలు మార్లు ఢిల్లీ వెళ్లినా స్వప్రయోజనాలకే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడలేదని విమర్శించారు. చంద్రబాబునాయుడు ఢిల్లీ వెళ్లినప్పుడల్లా రాష్ట్రానికి ఏదో ఒక భరోసా వస్తోందన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావుకు అభినందనల వెల్లువ

ఎలమంచిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండవ సారి ఎన్నికైన ద్వారపురెడ్డి పరమేశ్వరరావును మంగళవారం అనకాపల్లిలో పార్టీ ఎలమంచిలి మండల అధ్యక్షుడు అగ్రహారపు కుమారస్వామితో పాటు పలువురు కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. అనకాపల్లి పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు ఎస్.గోవిందరావు, ఎస్.శ్రీను, డి.నూకరాజు, కె.అప్పలరాజు, తులసి, లోవ, బాబ్జీ, ఎన్.శ్రీను పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంతి భవనానికి మరమ్మతులు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



భవనానికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంతి భవనానికి ఎట్టకేలకు మరమ్మతులు చేస్తున్నారు. 'శిథిలావస్థలో ఆర్టీసీ విశ్రాంతి భవనం' అనే శీర్షికతో ఈ నెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. విశ్రాంతి భవనం శిథిలావస్థలో ఉండడంతో పాటు సీలింగ్ అట్టలు మీద పడిపోతుండడంతో నైట్‌హాల్ట్ డ్రైవర్లు, కండక్టర్లు భయాందోళనలకు గురవుతున్నారన్న వచ్చిన ఈ కథనంతో ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. దీంతో మంగళవారం నుంచి మరమ్మతు పనులు ప్రారంభించారు. అలాగే ఊడిపోతున్న సీలింగ్ అట్టలు తొలగించారు.

'జనసేన బలోపేతమే లక్ష్యం కావాలి'



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జనసేన బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్య చంద్ర పిలుపునిచ్చారు. మంగళశారం నాలుగు మండలాల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. టీడీపీ, జనసేన కూటమిలో భాగంగా టీడీపీ శ్రేణులతో కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లాడ సురేష్, నమ్మి రమణ రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కోవా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందన



బీజేపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన పరమేశ్వరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న గల్లా

రావికమతం, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ బలోపేతానికి విశేష కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావుకు పార్టీ అధిష్ఠానం గుర్తించి రెండవ సారి ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించడం అభినందనీయమని ఆ పార్టీ స్టేట్ కౌన్సిలర్ గల్లారాజేశ్వరావు అన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా అధ్యక్షులు పరమేశ్వరావును మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం ఎనలేని కృషి చేస్తూ, కార్యకర్తలకు నిరంతరంగా అందుబాటులో ఉంటున్న నేత పరమేశ్వరరావు అని అన్నారు. ఈ పదవికి పరమేశ్వరావు వచ్చేలా కృషి చేసిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణదారులతో సమావేశం

రావికమతం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రహరీని ఆనుకుని నిర్మించిన దుకాణాలు తొలగింపుపై ఎంపీడీవో కె.వెంకన్నబాబు వెనక్కి తగ్గారు. ఈ ప్రహరీని ఆనుకుని ఉన్న తాత్కాలిక దుకాణాలను ఈ నెల 25లోగా తొలగించాలని ఎంపీడీవో సోమవారం నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఎంపీడీవోతో దుకాణదారులతో సమావేశం అయ్యారు. చాలా కాలంగా దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నామని, ఆకస్మాత్తుగా ఖాళీ చేస్తే తమ కుటుంబాలు వీధిన పడతాయని ఎంపీడీవో ఎదుట మొరపెటుకున్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణ విచారణలో సమన్వయ లోపం

- తమ పరిధి కాదంటున్న పంచాయతీ, రెవెన్యూ, విద్యా శాఖలు
- మేడివాడ మేజరు పంచాయతీ శివారు అప్పలమ్మపాలెంలో దుస్థితి



అప్పలమ్మపాలెం పాఠశాల ఆవరణలో ఓ వ్యక్తి నిర్మించిన పునాదులు

రావికమతం, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ మేజరు పంచాయతీ శివారు అప్పలమ్మపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణ ఆక్రమణలపై విచారణ ప్రభుత్వ శాఖల సమన్వయ లోపంతో నిలిచిపోయింది. ఈ గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆవరణను ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపడుతుండడంతో వీటిని నిలిపివేయాలని గ్రామానికి చెందిన అప్పికొండ భాస్కరరావు, మడక సత్తిబాబు స్థానిక ఎంపీడీవో వెంకన్నబాబు, ఎంఈవో బ్రహ్మాజీ, తహసీల్దార్ బి.వెంకటరమణలకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు నుంచి స్పందన లేకపోవడంతో జిల్లా కలెక్టరు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వేదికలో మరో వినతిపత్రం సమర్పించారు. దీంతో స్థానిక అధికారులు చలనం ప్రారంభమైంది. పాఠశాల ఆక్రమణల గుర్తుంపు బాధ్యత రెవెన్యూ శాఖదని, మండల పరిషత్ అధికారులు కాదు గ్రామ పంచాయతీకే పాఠశాల ఆక్రమణల తొలగింపు అధికారం ఉందని రెవెన్యూ అధికారులు ఒకరిపైనొకరు నెట్టుకుంటున్నారు. ఇలా సాకు లు చెప్పుకుంటూ ఆక్రమణలపై విచారణ వాయిదా పడుతూ వస్తోంది. పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ 2011లో జారీ చేసిన జీఎ188 ప్రకారం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల ఆక్రమణల తొలగింపు,ఫిర్యాదులపై విచారణ పంచాయతీ పాలక వర్గ బాధ్యతని తహసీల్దార్ వెంకటరమణ మండల పరిషత్, విద్యాశాఖ, పంచాయతీ అధికారులకు తెలియజేశారు. మీరు కోరితే ఆక్రమణలపై పాఠశాల ఆవరణ సర్వే చేపట్టి హద్దులు నిర్ధారణ చేస్తామని వివరించారు. ఆక్రమణ గుర్తుంపునకు పాఠశాలకు తరలిరావాలని లిఖిత పూర్వకంగా ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి ఎంఈవో హాజరుకాలేదు. ఆక్రమణ గుర్తింపు బాధ్యత తమది కాదని ఈవోపీఆర్డీ భానోజీరావు వాదనలు వినిపించారు. దీంతో ఆక్రమణల గుర్తింపు కార్యక్రమం నీరుకారిపోతుంది.

జి.కోడూరు సర్పంచ్, కార్యదర్శులకు నోటీసులు

- నిధుల గోల్‌మాల్‌పై స్పందించిన డీపీవో శిరీషారాణి

మాకవరపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జి.కోడూరు పంచాయతీ నిధులు గోల్‌మాల్‌పై సర్పంచ్‌తో పాటు ముగ్గురు కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీలో వీధిలైట్లు, పారిశుధ్యంతో పాటు 14, 15 ఆర్థిక సంఘాల నిధులు దుర్వినియోగమయ్యాయని టీడీపీ నాయకుడు మళ్ల జగన్నాథరావు స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీపీవో విచారణకు స్పీకర్ ఆదేశించారు. ఈ మేరకు సెప్టెంబరు 5వ తేదీన నర్సీపట్నం ఈవోపీఆర్డీ మహేశ్, మాకవరపాలెం ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి రికార్డులను పరిశీలించారు. అప్పటిలో అనారోగ్యం కారణంగా సర్పంచ్ విచారణకు హాజరు కాలేదు. దీంతో పలుమార్లు విచారణ చేసి నిధులు దుర్వినియోగమైనట్టు గుర్తించి డీపీవోకు పూర్తి నివేదికను అందజేశారు. ఈ మేరకు డీపీవో శిరాషారాణి ఇటీవల జి.కోడూరు సర్పంచ్, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసినట్టు ఇన్‌చార్జీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. కాగా, గతంలో ఇదేపంచాయితీలో నిధులు దుర్వినియోగం కాలేదని అప్పటి అధికారులు ఇచ్చిన రిపోర్టు, ప్రస్తుతం నిధులు దుర్వినియోగం అయ్యాయని ఇప్పుడు ఇచ్చిన అధికారులు రిపోర్టును కలిపి జి.కోడూరు సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో జిల్లా అధికారులతో పాటు స్థానిక అధికారులకు కోర్టు నోటీసులు వచ్చాయి. దీనిపై అధికారులు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

తెలుగు సంప్రదాయాలను కాపాడుకోవాలి



ముగ్గులను పరిశీలిస్తున్న సీఐ రేవతమ్మ

నాతవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంప్రదాయాలను కాపాడుకోవాలని సీఐ రేవతమ్మ కోరారు. తాండవ గ్రామంలో మంగళవారం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. వీటిని సీఐ పరిశీలించి మాట్లాడారు. తీర్థాలు ఐక్యతకు చిహ్నమన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహూమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.భీమరాజు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ రజాక్, టీడీపీ నాయకులు కాశపు నూకరాజు, డైరక్టర్ సత్యనారాయణ, అపన విజయ్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 120 మంది చేరిక



కుమారుపురంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

కృష్ణాదేవిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీహెచ్.నాగాపురం పంచాయతీ కుమారుపురం గ్రామంలో 120 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ కొలగాని రామారావు ఆధ్వర్యంలో వీరంతా పార్టీ కండువా వేసుకున్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని, అందుకే పార్టీలోకి వచ్చామని ఈ సందర్భంగా వారు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ఎస్ఎంసీ ఛైర్మన్ అప్పారావు, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ సీనియర్ నాయకులు పోలిశెట్టి జగ్గయ్యదొర, బొప్పన ప్రసాద్, కలం నాగేశ్వరావు, సేనాపతి వరహాలబాబు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ

గొలుగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండల కేంద్రంలో మహిళలపై లైంగిక వేధింపులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ వేధింపుల నిరోధానికి డిపార్టుమెంట్‌ల వారీగా కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న వేధింపులను ఈ కమిటీలు అరికడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజీ, ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి, సూపర్‌వైజర్లు కిరణ్ పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల మంజూరు

మాకవరపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెన్షనర్ల సంఘాల సభ్యులకు 95 శాతం లైఫ్ సర్టిఫికెట్లను మంజూరు చేశామని సంఘం మండల అధ్యక్షుడు కోసూరు రామారావు తెలిపారు. తామరంలో మంగళవారం రామలక్ష్మణ్ పింఛన్ సంఘం ఎనిమిదో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికోసారి రూ.1100 కడితే సభ్యులల్లో ఎవ్వరైనా చనిపోయినా ఆర్థిక సాయం కింద నగదు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఛైర్మెన్ నూకరాజు, నర్సీపట్నం, కోటవురట్ల ఎస్‌టీవోలు గణేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు తీసుకోండి

- వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి

నర్సీపట్నం అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు గుర్తింపు కార్డు పొందాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీదేవి సూచించారు. మండలంలోని ఎరకన్నపాలెం, కొత్తలక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు గుర్తింపు కార్డు ద్వారా ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్రంలో ఈ పథకం ప్రారంభమవుతుందన్నారు. పీఎం కిసాన్ పొందే రైతులు మార్చి 31వ తేదీలోగా గుర్తింపు నంబరు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అప్పారావు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి దివ్య, రైతులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపుల నిరోధానికి ప్రత్యేక చర్యలు

నాతవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వివిధ సంస్థలలో పనిచేసే మహిళలపై వేధింపులు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఐసీడీఎస్ పీవో గౌరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులు, కమిటీల సభ్యులతో మహిళలపై వేధింపుల అరికట్టాలన్న అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలు ఏ సంస్థలో పనిచేసినా వేధింపులు లేకుండా, స్వేచ్ఛగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంపూర్ణ ఆరోగ్యంతోనే అధిక పాల దిగుబడి

గొలుగొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే అధిక పాల దిగుబడి ఉంటుందని పశు వైద్యాధికారి రమేశ్ చెప్పారు. మండలంలోని కశిమి, రావణాపల్లి గ్రామాల్లో మంగళవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల ఆరోగ్యంపై అవగాహన అవసరమన్నారు. ఈ శిబిరాల్లో 205 పశువులు, 30 మేకలు, 45 ఆవులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి పుష్ప, రైతులు పాల్గొన్నారు.

'సమస్యలపై అప్పలనాయుడు పోరాటాలు మరువలేం'

కృష్ణాదేవిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై కామ్రేడ్ పరవాడ అప్పలనాయుడు చేసిన పోరాటాలను మరువలేమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పేర్కొన్నారు. చోద్యం గ్రామంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శిగా, జిల్లా సహాయకార్యదర్శిగా అప్పలనాయుడు పేదల పక్షాన పోరాడన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకా సత్యనారాయణ పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్, వరికుప్ప దగ్ధం



మంటలను ఆర్పుతున్న రైతులు

బుచ్చెయ్యపేట/రావికమతం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేతవాని పాలెం సమీపాన పి. భీమవరంలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై వేసిన వరిగడ్డి, పక్కనున్న మంటల వ్యాపించి వరి కుప్పకు సైతం అంటుకుని దగ్ధమైంది. గ్రామానికి చెందిన బయ్యారపు అప్పారావు, సంతోషిలు వరి నూర్పులు చేపట్టారు. నూర్పిన తరువాత గడ్డిని ట్రా క్టర్‌పైకి లోడ్ చేశారు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌పై ఉన్న ఎండుగడ్డికి నిప్పు అంటుకోవడంతో గడ్డి పూర్తిగా కాలిపోయింది. ఈ మంటలు సమీపంలోని వరికుప్పలకు కూడా అంటుకుని అవీ దగ్ధమయ్యాయి. మంటలను స్థానికులు అదుపు చేశారు. రూ.2 లక్షల వరకు ఆస్తి నష్ట వాటిల్లినట్టు బాధితులు తెలిపారు.

లేగదూడల ప్రదర్శన



గొటివాడ అగ్రహారంలో లేగదూడల ప్రదర్శన

మాడుగుల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొటివాడ అగ్రహారంలో మంగళవారం లేగదూడల ప్రదర్శన పశుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గొటివాడ అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు గ్రామాల్లో పాడిరైతులు ఏడాది వయసు లోపు ఉన్న జెర్సీ, హెచ్ ఎఫ్, ఒంగోలు, పుంగనూరు, ముర్రా జాతికి చెందిన గేదె జాతి దూడలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ముఖ్య అతిథులుగా పాడేరు డివిజన్ ఉప సంచాలకులు నరశింహులు, మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ చిట్టినాయుడు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో గాడిరాముకి చెందిన సాహివాల్ జాతి పెయ్యికి ప్రథమ బహుమతి, కాళింగి అప్పలనాయుడుకి చెందిన పుంగనూరుజాతి పెయ్యికి రెండవ, బొడ్డేటి నూకరాజుకి చెందిన హెచ్‌ఎఫ్ జాతి పెయ్యికి మూడో బహుమతి లభించాయి. విజేతలకు బహుమతులు అందించారు. పశు వైద్యులు మణిలక్ష్మణ్, గణేశ్, సౌజన్య, నాయకులు పానాపతి, నాయుడు పాల్గొన్నారు.


'దివ్యాంగుల అర్హత పరిశీలన మండల కేంద్రాల్లోనే నిర్వహించాలి'



ఎంపీడీవోకు వినతి పత్రమి స్తున్న దివ్యాంగుల పోరాట సమితి కన్వీనర్

రావికమతం, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాలతో వైద్య బృందం నిర్వహిస్తున్న దివ్యాంగుల అర్హత వెరిఫికేషన్ కార్యక్రమం జిల్లా కేంద్రంలో కాకుండా మండల కేంద్రాల్లో నిర్వహించాలని నియోజక వర్గ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కన్వీనర్ గంజి శ్రీను కోరారు. ఈ మేరకు ముఖ్య మంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, కలక్టర్‌కు వినతి పత్రాలను పంపించారు. అలాగే, మంగళవారం స్థానిక ఎంపీడీవో వెంకన్న బాబుకు ఈ వినతా పత్రం అందజేశారు. పింఛన్ దారుల్లో అనర్హులను గుర్తించడం సబబేనన్నారు. అయితే గతంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులకు మారుమూల గ్రామాల దివ్యాంగులు అంతదూరం వెళ్లేందుకు ఇబ్బంది ఎదుర్కొంటాయన్నారు. ఈ కార్యక్రమం ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఘనంగా పైడిమాంబ తీర్థ మహోత్సవం



ఎడ్లజతల యజమానులకు బహుమతులు ఇస్తున్న మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట గ్రామదేవత పైడిమాంబ తీర్థం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పైలాప్రసాదరావు, మాజీ ఎంపీపీ కిలపర్తిభాస్కరరావు, చిరికి గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు మొల్లికృష్ణమూర్తి, బర్లనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎడ్ల పరుగు ప్రదర్శనను తిలకించారు. ఎడ్ల పరుగులో ముమ్మిన కనకరాజు (నర్సయ్యపేట) ఎడ్ల జతకు ప్రథమ స్థానం సాధించింది. అభయాంజనేయ (సింహాద్రిపురం) రెండవ స్థానం, స్థానిక సిద్ధి వినాయక (నర్సయ్యపేట) మూడవ స్థానం మురికుర్తి హరికృష్ణ (చుక్కపల్లి), పంచాద వెంకటరావు (రేవళ్ల), పైడితల్లమ్మ, వీరాంజనేయ, రొంగలి. రవితేజ (కొత్తపెంట) ఎడ్లు వరుసగా విజయం సాధించాయి. విజేతలైన రైతులకు బహుమతులను బూడిముత్యాలనాయుడు, రొంగలి వెంకటరావు, శంకరరావు తదితరులు అందించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి తీర్థం ..



వీర బ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కెకోటపాడు: మండల కేంద్రంలో విశ్వ బ్రాహ్మణల సంఘం, టీడీపీ గ్రామ అధ్యక్షులు ఇంజరపు బ్రహ్మజీ ఆధ్వర్యంలో మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామివారికి భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్య క్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి.

సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలి

- మాడుగుల మండల సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ

మాడుగుల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముందుగా వ్యవసాయశాఖ, ఇరిగేషన్, రెవెన్యూ, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శా ఖల అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సక్రమంగా సరఫరా కావడంలేని వాపోయారు. రెవెన్యూ సమస్యలపైనా స్పందించడంలేని ఆరోపించారు. గ్రామాల్లో వ్యాబలుతున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అలాగే, పొలాలకు సాగునీరు స క్రమంగా అందించడంలేదని ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన భాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజా ప్రతినిధులతో కలసి పనిచేయాలని సూచించారు. పథకాలు అర్హులకు చేరవేయాలన్నారు. ప్రజలకు వైద్యం సకాలంలో అందించాలన్నారు. విద్యుత్‌కు అంతరాయంలేకుండాలని చూడాలని, వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

2025-26 ఏడాదికి అంచనా బడ్జెట్

అనంతరం 2025-26 ఏడాదికి సంబంధించి అంచనా బడ్జెట్‌ని అధికారులు చదివి వినిపించారు. 2024-25కి సంబంధించి 30కోట్ల 31లక్షల 13వేలు ఆదాయం కాగా, 30 కోట్ల 25లక్షల 68వేల ఖర్చు చూపారు. 5లక్షల 45వేల రూపాయలు మిగిలు చూపారు. అలాగే 2025-26లో 32కోట్ల 52లక్షల 17వేలు ఆదాయం , ఖర్చు 32కోట్ల 47 లక్షల 13వేల 500 ఖర్చు. 5లక్షల 3,500 మిగులుతుందని అంచనా బడ్జెట్‌గా చూపారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ మంత్రి రెడ్డి సత్యనా రాయణ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ ఛైర్మన్ పీవీజీ కు మార్, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, వైస్ ఎంపీపీ శ్రీను మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అపరాల పంటలపై తెగుళ్లపై అవగాహన



మామిడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రనాథ్

దేవరాపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రబీలో పెసర, మినుము, నువ్వు పంటల్లో తెగుళ్ల అప్రమత్తంగా ఉండాలని చోడవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి.రవీంద్ర, ఏవో ఎల్. వై. కాంతమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని బి.కింతాడ,మామిడిపల్లి, కలిగొట్ల గ్రామాల్లో పంటల పరిశీలించి తెగుళ్లపై అక్కడకక్కడే సూచనలు ఇచ్చారు. నువ్వులు వేసుకుంటే ఆఖరి దుక్కులో ఎస్.ఎస్.పి . 50 కిలోలకు పది కిలోల పొటాష్ వేయడం వల్ల నూనెశాతం పెరుగుతుందన్నారు.వేరు శనగ ప్రస్తుతం ఎకరాకు 200 కిలోల జిప్సం వేసుకోవాలన్నారు. మినుములో బూడిద తెగులు నివారణకు మైక్రో బూటానియల్ ఒక గ్రాము మందు ఒక లీటరు నీటికి లేదా డైనోకాప్ లేదా పెన్కజోల్ మందును పిచికారీ చేయాలని కోరారు. ఆకు ముడత నివారణకు థయోమిథాక్షం చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, మామిడిపల్లి సర్పంచ్ సూరినాయుడు, కొమార.బాబూరావు, కడింనాగేశ్వరరావు, దొగ్గనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి తీర్థం



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే బండారు

చీడికాడ, జనవరి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పెదగోగాడలో మంగళవారం కనకమహాలక్ష్మి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనా రాయణమూర్తి, మాజీ సర్పంచ్ రెడ్డి జయమ్మ, రెడ్డి రాము, పైల అచ్చియ్య మ్మ తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక నమోదు క్యాంపులను వినియోగించుకోండి

రోలుగుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. 6 ఏళ్ల లోపు పిల్లలకు నూతన ఆధార్ నమోదు, ఇతర పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్, మార్పులు, చేర్పులు తదితర సేవలు అందిస్తారని తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో శరభవరం, ఎంకేపట్నంలు, అలాగే 27న బుచ్చెంపేట, జగ్గంపేట, 28న కొవ్వూరు, గుండుబాడు, 29న రోలుగుంట, కుసర్లపూడి, 30న నిండుగొండ, జానకిరాంపురంలో ఈ ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాడి అభివృద్ధికి శిబిరాలు దోహదం



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధకశాఖ డివిజన్ ఉపసంచాలకులు నర్సింహులు

చీడికాడ జనవరి 21(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి పశువైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పశుసంవర్ధకశాఖ పాడేరు డివిజన్ ఉప సంచాలకులు డా.నర్సింహులు అన్నారు. మండలంలో జెబి.పురం లో మంగళవారం పశువైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన గొర్రెలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు గొల్లవిల్లి రాజబాబు, రాకోట వెంకట సత్యనా రాయణతో కలిసి పశువైద్య శిబిరం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఏడీ వి.చిట్టి నాయుడు, స్థానిక పశువైద్యాధికారి జి.గాయిత్రిదేవి తదితరులు పాల్గొన్నారు. జైతవరం గ్రామంలో జరిగిన పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ పైల ముత్యాల నాయుడు ప్రారంభించారు. పశువైద్యాధికారి కెవిఎస్.రాఘవమ్మ, సిబ్బంది సేవలందించారు.

బుచ్చెంపేటలో పశువైద్య శిబిరం

రోలుగుంట: మండలంలోని బుచ్చెంపేటలో పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఉలబాల చంద్ర ప్రారంభించారు. పశువైద్యాధికారి డా.బాలమౌనిక ఆధ్వర్యంలో ఈ శిబిరంలో 80 పశువులు, 20 దూడ పెయ్యిలకు, 400 గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. సిబ్బంది భవాని, రమణ, దివ్య, సాయికృష్ణ పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడిలో పశువైద్యాధికారి మంజుషారాణి, కలిగొట్లలో వైద్యాధికారి జి.ప్రియాంక పశువులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, నాయుడు, దొగ్గనాయుడు పాల్గొన్నారు.

నేడే అరకులోయలో పాస్‌పోర్టు కార్యాలయం ప్రారంభం



అరకులోయలో పోస్టాఫీసు ఆవరణలో ఏర్పాటుచేసిన పాస్‌పోర్టు ఆఫీస్ ఇదే

అరకులోయ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం, అరకు ఎంపీ, అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రమైన అరకులోయలో పాస్‌పోర్టు కార్యాలయం బుధవారం ప్రారంభించనున్నారు. అరకు ఎంపీ డాక్టర్ జి. తనూజారాణి ముఖ్య అతిథిగా ఈ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు పాస్‌పోర్టు ఆఫీస్‌కు అవసరమైన ఫర్నీచర్, కంప్యూటర్స్ అంతా సిద్ధం చేశారు. ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు అరకు సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ పోస్టల్ అధికారులు, పాస్‌పోర్టు అధికారుల పర్యవేక్షణలో చేస్తున్నారు.

'ఏకలవ్య'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డుంబ్రిగుడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డుంబ్రిగుడ ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ సుమంత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న బాల బాలికల నుంచి దరఖాస్తులను వచ్చే సెల 19 వరకు చేసుకోవచ్చున్నారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సరకుల పక్కదారిపై విచారణ


రంగిలిసింగి డిపోలో విచారణ చేస్తున్న సీఎస్‌డీటీ ప్రశాంత్

డుంబ్రిగుడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రంగిలిసింగి డీఆర్‌డిపో పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన నిత్యావసర సరకులు పక్కదారిపై సీఎస్‌డీటీ ప్రశాత్ విచారణ చేపట్టారు. పొదుపు సంఘాల ద్వారా నడుస్తున్న ఈ డిపో ద్వారా కేంద్రాలకు చేరాల్సిన సరకులు సక్రమంగా పంపిణీ చేయడంలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య సంఘం కార్యదర్శి ధర్మయ్య ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌కు ఫిర్యాదు అందించారు. ఆయన ఆదేశాలపై సీఎస్‌డీటీ ప్రశాంత్ డిపో పరిధిలో కార్యకర్తలతో గ్రామంలో విచారణ నిర్వహించారు. సరకులు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని, సంబధిత డిపో నిర్వాహకులపై క్రిమినల్ కేసుతో పాటు నిర్వాహణ బాధ్యతనుంచి తొలగించాలని నివేదిక అందించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. అనంతరం డిపో నిర్వాహణ బాధ్యతకు సంబంధిత స్థానిక వీఆర్వోకు అప్పగించారు.

అంబాపడకు బీటి రోడ్డు నిర్మాణం


పూర్తయిన రోడ్డు

పెదబయలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరైడా పంచాయతీ పెద్దాపుట్టు నుంచి అంబాపడ వరకు గల 630 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం మంగళవారం పూర్తయినట్టు సర్పంచ్ చెండా రవిశంకర్ తెలిపారు. ఐదు నెలల క్రితం అప్పటి కలెక్టర్ సుమీత్ కుమార్ దృష్టికి గ్రామస్థులతో వెళ్లి తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని వినతి పత్రం అందించామన్నారు. కలెక్టర్ తక్షణమే స్పందించి ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో రోడ్డును నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అనంతరం పనుల్లో జాప్యం జరిగిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నిధులు సమకూర్చటంతో రోడ్డు పనులు పూర్తయ్యాయన్నారు. గ్రామానికి బీటి రోడ్డు రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జేఈ శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతీ, యువకులకు రీసోర్స్ పర్సన్స్‌గా ఉపాధి అవకాశాలు

పాడేరురూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ (పీఎంఎఫ్ఎంఈ)ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మండల స్థాయిలో రీసోర్స్ పర్సన్లను ఎంపిక చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరం నవంబరు 1వ తేదీకి 21 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత పొంది, కంప్యూటర్, ఇంటర్నెట్‌లో ప్రావీణ్యం ఉన్న, కలిగిన ఆ సక్తిగల స్త్రీ, పురుష, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు ఆయా మండలాల్లో ఉన్న వెలుగు కార్యాలయాల్లో ఈ నెల 26వ తేదీ ఆదివారం లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, ఫుడ్ ప్రాసెసింగ్, సహజ వనరుల అభివృద్ధి రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవస్థాపకులను పీఎంఎఫ్ఎంఈ పథకంలో చేరేవిధంగా ప్రోత్సహించాల్సి ఉంటుందన్నారు. డీపీఆర్ రూపకల్పన, బ్యాంక్ రుణాలు మంజూరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఉద్యోగ్ ఆధార్, జీఎస్టీ, సహా రిజిస్ట్రేషన్, లైసెన్స్‌లు పొందేలా చూడాలన్నారు.


వైద్య శిబిరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ, అధికారులు


దామనాపల్లిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

» జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ

పాడేరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ అన్నారు. కలెక్టరేట్‌లో పశు వైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో 441 కేంద్రాల్లో ఈనెల 22 నుంచి 31 తేదీ వరకు ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. అలా గే వైద్య శిబిరం నిర్వహించే ప్రదేశాలను పరిధిలో ఉంటే రైతులకు ముందుగానే సమాచారం అందిస్తారన్నారు. పశువులకు సంబంధించిన వ్యాధుల నివారణ, పలు రకాల వ్యాక్సిన్లను ఈశిబిరాల్లో వేస్తారన్నారు. ఈకార్యక్రమంలో పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు, వైద్యులు సృజన, రాజీవ్ కిశోర్ పాల్గొన్నారు.

తాటిపూడి ఆవలి గ్రామాల్లో వైద్య శిబిరాలు

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ చెరువుపాలెంనకు మంగళవారం నాటుపడవపై ప్రయాణించి పశు వైద్య సిబ్బంది వైద్యసేవలను అం దించారు.ఈ గ్రామానికి రహదారి సౌకర్య లేదు.. తాటిపూడి జలాశయం ఆనుకుని ఆవతలి ఒడ్డున ఉన్న ఈ గ్రామానికి చేరుకోవాలంటే తప్పనిసరిగా సాహసం చేయాల్సిందే. ఈ నేపథ్యంలో కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు ఆధ్వర్యంలోని మంగళవారం సిబ్బంది, మూడు నాటుపడవపై తాటిపూడి జలాశయంపై ప్రయాణించి ఆ గ్రామానికి చేరుకుని, పశువులకు వైద్యసేవలను అందించారు. అలాగే, కొత్తూరు పంచాయతీ దంసారాయి, చిలకలగెడ్డ పంచాయతీలోని మెట్టపాలెం, దబ్బలపాడుల్లో 108 పాడి పశువులకు వైద్య సేవలను అందించారు. అలాగే, 614 మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు సిబ్బంది తెలిపారు. పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావుతో పాటుగా అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరీ గిరిజనులకు పలు సూచనలు చేశారు.

గూడెంకొత్తవీధి: పశువైద్య శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి యు. రాజశేఖర్ తెలిపారు. మంగళవారం దామనాపల్లిలో ప్రత్యేక పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 36పశువులకు చికిత్స అందించారు. 172 పశువులు, 56పెయ్యలు, 286 గొర్రెలకు గర్భకోశ నివారణ, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 30వరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో స్థానిక సర్పంచ్ కుందరి రామకృష్ణ పాల్గొన్నారు.


కిముడిపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యురాలు సౌజన్యదేవి

కిముడుపల్లిలో పశు వైద్య శిబిరం

పెదబయలు: మండలంలోని కిముడుల్లి పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి ఎం. సౌజన్యదేవి, సిబ్బంది స్థానిక సర్పంచ్ శోభరాణితో కలసి రైతుల ఇళ్లకు వారి పశువులకు వైద్య సేవలందించారు. గ్రామంలో మొత్తం 137 గొర్రెలు, 56 ఆవులు, 27 మేకలకు నట్టల నివారణకు టీకాలు వేసినట్టు డాక్టర్ సౌజన్య తెలిపారు. అనారోగ్యం బారిన పడిన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబ్బంది స్వామి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మూగజీవాలు వ్యాధులు బారిన పడకుంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కిలగాడ పశు వైద్యాధికారి ఎం.సౌజన్యదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పెదగూడ, కిలగాడ, మినుములపుట్టు, కరిముక్కిపుట్టు తదితర గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. పశువులకు, మేకలకు వ్యాధులు రాకుండా టీకాలను వేశారు. పశువుల సంరక్షణపై అవగాహన కల్పించారు.


గోస్తనీ ఆవల గ్రామాలకు నాటుపడవలపై వెళ్తున్న వైద్య సిబ్బంది


పెదగుడలో మందులు అందిస్తున్న పశువైద్యాధికారి గణేశ్వరరావు

'వైసీపీ నిర్లక్ష్యం వల్లే భర్తీకాని ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులు'

చింతపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏరియా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులు భర్తీ కాలేదని టీడీపీ సీనియర్ నేత, లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆస్పత్రుల స్థాయిని పెంచిన గత వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులను మాత్రం భర్తీ చేయలేదన్నారు. చింతపల్లి 30 పడకల ఆస్పత్రిని 100 పడకలుగా గత ప్రభుత్వం స్థాయిని పెంచిందన్నారు. అయితే, ఉండాల్సిన వైద్యనిపుణుల పోస్టులు భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో నలుగురు పిడియాట్రిక్స్, ముగ్గురు గైనికాలజిస్టులు, ఇద్దరు ఎనస్థీషియా వైద్యనిపుణులు ఉండాలన్నారు. ప్రస్తుతం ఒక పిడియాట్రిక్స్ వైద్యులు మాత్రమే ఉన్నారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఖాళీగానున్న ప్రత్యేక వైద్యనిపుణుల పోస్టులను భర్తీకి కార్యాచరణ ప్రారంభించినట్టు చెప్పారు.

సోమవారం చింతపల్లి సర్వ సభ్య సమావేశంలో శిశు మరణాలపై సూపరింటెండెంట్‌పై కొం తమంది ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. శిశువులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణిస్తే చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఏవిధంగా బాధ్యులవుతారని ఆయన ప్రశ్నించారు. వైసీపీ ప్రజాప్రతినిధులు విజ్ఞతతో మెలగాలని హితవు పలికారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన


అరకులోయలో స్థల పరిశీలన చేస్తున్న ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ రమేశ్, రీజియన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర, ఆర్యవైశ్య నాయకులు

అరకులోయ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్టు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కొల్లారమేశ్, రంగా, గుప్తా ప్రకాశ్ తెలిపారు. బుధవారం అరకులోయకు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్, విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్, అరకు టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, వెంకన్న ఆలయ ప్రధాన అర్చకుడు బాల గణేశ్ వెంకన్న ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న కన్యకపరమేశ్వరి ఆలయం కోసం స్థల పరిశీలనలో ఉన్నారు. దొన్నుదొర, సర్పంచ్ దాసుబాబులు ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు, రంగా, వెలగా గుప్తా, కాపుగంటి గుప్తా, కొల్లా ప్రసాద్, భాస్కర్, గణేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ


స్వెటర్లు అందజేస్తున్న, జడ్పీటీసీ, రోటరీక్లబ్ ప్రతినిధులు

అనంతగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి కాశీపట్నం పంచాయతీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విశాఖపట్నం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఎంఈవో బాలజీ పాల్గొని మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో రోటరీక్లబ్ ఎన్నో సేవ, కార్యక్రమాలు చేపడుతుందని కొనియాడారు. హెచ్ఎం మల్లికార్జున, నరాజీ మల్లేశ్వరరావు, శెట్టి రాంబాబు, ఉషారాణి, శెట్టి మహేశ్వరీ, పడాల్, రోటరీక్లబ్ ప్రతినిధులు మణిమాల, వినయ్‌గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

25న జీకేవీధి మండల సర్వ సభ్య సమావేశం

గూడెంకొత్తవీధి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశం ఈనెల 25న నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. దిగువ స్థాయి ఉద్యోగులను పంపించరాదన్నారు.

పెదవలస యువకుడికి అవార్డు

గూడెంకొత్తవీధి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలస గ్రామానికి చెందిన యువకుడు షేక్ షాజహాన్‌కి సౌత్ కొరియా జాతీయ విశ్వవిద్యాలయం అరుదైన అవార్డును అందజేసింది. షాజహాన్ తక్కువ ధరకు హైడ్రోజన్ ఉత్పత్తి చేయడంపై పరిశోధన చేస్తున్నారు. ఈ మేరకు పరిశోధనలకు సంబంధించి ప్రఖ్యాత అడ్వాన్స్‌డ్ ఎనర్జీ మెటీరియల్ జర్నల్ ఆర్టికల్‌ను ప్రచురించింది. ఈ నేపథ్యంలో సౌత్ కొరియా క్యుంగ్ పూక్ యూనివర్సిటీ ఉత్తమ పరిశోధకుడిగా మంగళవారం అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా షాజహాన్ మాట్లాడు తూ ప్రకృతికి హాని కలగకుండగా హైడ్రోజన్ ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పరిశోధనలు కొనసాగిస్తున్నట్టు తెలిపాడు.


దక్షిణకొరియాల్లోని ఓ వర్సిటీలో అవార్డు అందుకున్న షేక్ షాజహాన్

సారాతో మహిళ అరెస్టు

కశింకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం గ్రామ శివారులో నాటుసారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మన్నాయుడు తెలిపారు. మంగళవారం తమకు ముందస్తుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ కేఎస్.గణేశ్, సిబ్బంది వెళ్లి పరిశీలించగా బత్తిన లక్ష్మి అనే మహిళ పట్టుబడిందన్నారు. ఈ మేరకు ఆమె నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ప్రొహిబిషన్ చట్టం 1995 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

27 నేషనల్ ఎలక్ట్రీషన్ డే

పాడేరురూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న నేషనల్ ఎలక్ట్రీషియన్ డే విజయవంతం చేయాలని ఏపీ ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ ప్రతినిధి, అల్లూరి సీతారామరాజు జిల్లా గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు కోరారు. స్థానిక ఉమానీలకంఠేశ్వర స్వామి వారి రాజరాజేశ్వరి దేవి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో తొలిసారిగా రాష్ట్ర ఎలక్ట్రీషన్ డే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి దామోదర్, కోశాధికారి మఠం స్వామినాయుడు, పాడేరు డివిజన్ అధ్యక్షుడు పొట్లూరి బబ్లూ, బంగారు ప్ర కాష్, పట్నాయిక్ శేఖర్, గోకడా కృష్ణారావు, కోట సన్యాసిరావు, లకే గిరిపాత్రుడు, బయ్యవరపు కొండబాబు, పీలా రవితేజ, ఎరికిరెడ్డి మధు, గొల్లూరి సురేష్, ఎం.దుర్గాప్రసాద్, ఆర్.రాజు. జిల్లా ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ టెక్నికల్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు

కశింకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ టెక్నికల్ ఆఫీసర్‌గా సెయింట్ జాన్స్ స్కూలుకు చెందిన పీఈటీ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఎంపికయ్యారని స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఫస్ట్ ఖో-ఖో వరల్డ్ కప్ ఆఫ్ ఇండియాలో ప్రపంచంలో 34 దేశాలు పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు మాత్రమే ఎంపికయ్యారని చెప్పారు. వీరిలో ఒకరిగా ఎంపికైన శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

» నా అనే వారు లేక.... ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడు


బ్లడ్ క్యాన్సర్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న శ్యామ్ ప్రకాశ్

కొయ్యూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రులను కోల్పోయి, ప్రాణాంతక వ్యాధి బారిన పడి తగిన వైద్య సేవలకు ఆర్థిక స్థోమత లేక ప్రాణాపాయ స్థితిలో రాజేంద్రపాలెంకు చెందిన బాలుడు కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాజేంద్రపాలెంకు చెందిన గోకిరి శ్యామ్ ప్రకాశ్ (16) అనే బాలుడు తండ్రి నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్య బారిన పడి మృతి చెందాడు. తల్లీ దూరమైంది. ఇలా తల్లితండ్రులకు దూరమై అనాథగా మారిన శ్యామ్‌కు బ్లడ్ క్యాన్సర్ సోకింది. దీంతో వరుసకు చినాన్న అయిన గోకిరి శ్రీను తనకున్న దానిలో వైద్య సేవలందిస్తున్నాడు. శ్రీను జీవనం కూడా అంతంతమే కావడంతో వైద్య సేవలు సకాలంలో అందిచలేకపోవడంతో ప్రకాశ్ మంచానికే పరిమితమయ్యాడు. ఈ బాలుని దుస్థితిని దృష్టిలో ఉం చుకుని ఉన్నతాధికారులు స్పందించి ఉచితంగా వైద్య సేవలందింప చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన చిన్నాన్న శ్రీను కోరుతున్నారు. ప్రాణాంతక వ్యాధితో శ్యామ్ ప్రకాశ్‌కు తగిన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు వీలుగా ఆర్థిక సహాయం అందించేలా దాతలు ముందుకు రావాలని కోరుతున్నాడు. వివరాలకు ఫోన్: 93819 62125 సంప్రదించి ఆదుకోవాలని అభ్యర్థించారు.

డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు


రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాంగా మంగళవారం స్థానిక కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రైవేటు జీపు, ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలను చేపట్టినట్టు జిల్లా రవాణాధికారి ఎస్.లీలాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మందకి కంటి పరీక్షలను చేపట్టి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ కోడి వాసు, కంటి వైద్య నిపుణులు డి.వెంకటరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వరుస శిశు మరణాలపై అధికార యంత్రాంగం స్పందించాలి

» గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్


ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతితో మాట్లాడుతున్న గిరిజన సంఘంనేత ధనుంజయ్

చింతపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాముగెడ్డ గ్రామంలో సంభవించిన వరుస శిశు మరణాలపై అధికార యంత్రాంగం స్పందించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. ప్రభావతిని కలిసిన ఆయన శిశు మరణాలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 20 రోజుల వ్యవధిలో వాముగెడ్డలో ముగ్గురు మూడు నెలల వయస్సు కలిగిన శిశువులు ఒకేరకమైన వ్యాధి లక్షణాలతో మృతి చెందడం విచారకరమన్నారు. ఇందుకు గల కారణాలను వెలికితీసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కనీసం స్పందించలేదన్నారు. నేటి వరకు గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సందర్శించలేదన్నారు. గ్రామంలో ముగ్గురు మృతి చెందిన ముగ్గురు శిశువుల్లో ఒకరు గ్రామంలో, మరో ఇద్దరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారన్నారు. చిన్నారులు వరుసగా మృతి చెందడానికి కారణాలను తెలుసుకోవాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖపై ఉన్నదన్నారు. గ్రామంలో బాలింతలు, గర్భిణులు, శిశువులకు పోషకాహారం లోపం వల్ల మరణాలు సంభవించాయా? తాగు నీటి వల్ల సమస్య తలెత్తిందా? అనే విషయం తెలుసుకోవాలన్నారు. శి భవిష్యత్‌లో శిశు మరణాలు సంభవించకుండగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో ఇతర శిశువులు వ్యాధులు బారినపడకుండగా ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కూడా సింహాచలం, మజ్జి రాంబాబు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల్లో ఖాళీల భర్తీలో ఆదివాసీలకు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

పాడేరురూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులను స్థానిక ఆదివాసీ యువకులతోనే భర్తీ చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పాచిపెంట అప్పలనర్స డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుంటే ప్రజాప్రతినిధులు సవతి తల్లి ప్రేమను చూపడం దురదృష్టకరమన్నారు. మెడికల్ కళాశాలలో పోస్టులు భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌లో 244 పోస్టులు ఉన్నాయని, అయితే, వీటిని శతశాతం రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించకపోవడంతో కేవలం 39 పోస్టులు మాత్రమే ఆదివాసీలకు కేటాయించారన్నారు. కళాశాల్లో ఖాళీగా ఉన్న 24 పోస్టులకు సుమారు 15 వేల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో ఆదివాసీ యువతకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే శతశాతం రిజర్వేషన్‌పై రాష్ట్ర క్యాబినెట్‌లో తీర్మాణం చేసి అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను చూపి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుందరరావు, దాస్ పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న మహిళా కమిషన్ సభ్యురాలు


కమిషన్ సభ్యురాలు, ఎంపీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాడేరురూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మను అరకు ఎంపీ జి. తనూజారాణి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఆచారం ప్రకారం ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం శాస్త్రి, ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో సత్కరించి అమ్మవారి చిత్ర పటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సల్లా రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, కిల్లు రాధాకృష్ణన్ నాయుడు, లకే రత్నాబాయి, కిల్లు చంద్రమోహన్, ఎస్.ఈశ్వరమ్మ, టి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, పక్కన ఎస్పీ, జేసీ

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా 76వ గణతంత్ర వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి గణతంత్ర వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. అన్ని శాఖలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా శకటాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి డీఆర్వో సత్యనారాయణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

మహిళల సమస్యలు పరిష్కరించండి

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతి


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

కొత్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ, వృద్ధ, అనాథ మహిళల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు తాతపూడి జయశ్రీ, శివశంకర్ కలిసి తదితరులు మంగళవారం ఎమ్మెల్యేను తమ సమస్యలను వివరించారు. దివ్యాంగులు, యువతీ, యువకులు, మహిళలకు సంస్థ తరఫున పలు సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఈ సేవలను మరింత పటిష్ఠవంతం చేయడానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే ప్రభుత్వ స్థలం కేటాయింపులో తన వంతు కృషి చేస్తానని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ప్రదీప్ కుమార్, లీగల్ అడ్వైజర్ గేదెల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

హరిదాసులను ప్రభుత్వం ఆదుకోవాలి

▸▸ బీఎస్పీ జిల్లా నాయకుడు మాణిక్యాలరావు


హరిదాసుతో మాట్లాడుతున్న బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు

కొత్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారత సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా కడు పేదరికంతో బతుకున్న హరిదాసులను ప్రభుత్వం ఆదుకోవాలని బహుజన సమాజ్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజక వర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు విజ్ఞప్తి చేశారు. గతంలో వందల సంఖ్యలో హరిదాసులుగా జీవించిన వారు, ప్రస్తుతం అరుదుగా మాత్రమే కనిపించే స్థాయికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో వారు కూడా కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదని వాపోయారు. హరిదాసులను కళాకారులుగా గుర్తించాలని, వారికి పింఛన్లు ఇచ్చి ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

వీఐ లెనిన్‌కు నివాళులు


లెనిన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు దేశ వ్యవస్థాపకులు వీఐ లెనిన్‌కు సీపీఎం నాయకులు మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. లెనిన్ చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పీడిత ప్రజల జీవితాల బాగు కోసం పోరాడిన మహానేత లెనిన్ అని కొనియాడారు. ప్రపంచంలో మొట్ట మొదటిసారిగా కార్మిక రాజ్యాన్ని నిర్మించడంలో లెనిన్ పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లు రాజు, గంటా శ్రీరామ్, వెంటకోట శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, కె.ఈశ్వరరావు,జి. సుభాషిణి పాల్గొన్నారు.

ఘనంగా పంచముఖ ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం



సబ్బవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధి అజనగిరి గ్రామంలో పంచముఖ ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని ప్రత్యేకంగా పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన చిడతల బజనలు, కోలాటం, నేల డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. రాత్రి విప్లవ సింహాలు సాంఘిక నాటక ప్రదర్శన జరిగింది. స్వామివారిని స్థాని నాయకులు ఇందలి వెంకటరమణ, నారపిన్ని అప్పలరాజు, పోలీసు, దేముడుబాబు, బొడ్డేపల్లి తాతబాబు, గంగరాజు, గవర శ్రీను, చెట్టి కృష్ణ, గగనం రాంబాబు తదితరులు దర్శించుకున్నారు.

గంజాయికి దూరంగా ఉండండి: సీఐ

కశింకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గంజాయికి దూరంగా ఉండండి.. బంగారు భవిష్యత్తును సొంతం చేసుకోండి అంటూ పోలీసులు యువతకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాళ్లపాలెం సోమవారం రాత్రి జరిగిన తీర్థ మహోత్సవంతో స్టేజీపై ప్రజలందరికీ గంజాయి, డ్రగ్స్‌కు బానిస కావడం వల్ల కలిగి నష్టాలను ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లో జరిగే ఆర్థిక మోసాలు, జాబ్ ఇప్పిస్తామని, లోన్లు కల్పిస్తామని చెబుతూ వచ్చిన ఫోన్‌కాల్స్ విషయాలను ఎల్ఈడీ స్క్రీన్‌పై క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు, సిబ్బంది, నేతలు పాల్గొన్నారు.

మురుగు పారదు.. కంపు వదలదు!

పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా తయారైంది. ఏ కాలువ చూసినా వ్యర్థాలతో నిండిపోయి కనిపిస్తోంది. మురుగు పారే అవకాశం లేకపోతోంది. చెత్త కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగల ఉత్పత్తి రెట్టింపవుతోంది. ఫలితంగా ప్రజలకు కంటి మీద కునుకు కరువవుతోంది.

- ▸▸ పట్టణంలో అధ్వానంగా కాలువలు
- ▸▸ డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- ▸▸ చెత్త కుళ్లిపోయి భరించలేని దుర్వాసన
- ▸▸ స్వైరవిహారం చేస్తున్న దోమలు, ఈగలు
- ▸▸ ప్రజలు అగచాట్లు.. పట్టించుకోని అధికారులు

అనకాపల్లి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రింగురోడ్డు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌రోడ్డు, ఉడ్‌పేట, ఎన్టీఆర్ మార్కెట్‌యార్డు వద్ద తదితర ప్రాంతాల్లో కాలువలు పరిశుభ్రతకు నోచుకోవడం లేదు. కాలువలు అధ్వానంగా తయారు కావడంతో ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. రోజుల తరబడి కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించకపోవడం వల్ల రోజు రోజుకి కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. దీంతో రోడ్డు పక్కన చిరు వ్యాపారులు కాలువకు ఆనుకుని ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కాలువలకు ఆనుకుని నివాసం ఉంటున్న వారు దోమలు, ఈగల బాధలతో నరకం చూస్తున్నారు. ఇప్పటికే దోమలు అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతుండగా కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడం వల్ల మరింత దుర్భరంగా మారాయి. దుర్వాసనలు వెదజల్లడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సాయిబాబా మందిరానికి వెళ్లే జంక్షన్‌లో అధ్వానంగా ఉన్న కాలువ


ఉడ్‌పేటలో మురుగు పారని విధంగా పేరుకుపోయిన వ్యర్థాలు

పలు చోట్ల కాలువల్లో నుంచి నీరు ప్రవహించకపోవడం వల్ల ఎక్కడికక్కడ చెత్తాచెదారం స్తంభించిపోతోంది. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కాలువల నిర్మాణంలో నీరు ఎగువ ప్రాంతానికి ప్రవహించే విధంగా తగిన చర్యలు చేపట్టకపోవడం వల్ల నీటితో పాటు ఎక్కడికక్కడ చెత్తా చెదారం నిలిచిపోతున్నదని పారిశుధ్య విభాగం అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తా చెదారంతో ఉన్న కాలువలను తక్షణమే పరిశుభ్రంగా తయారు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్న కాలువ

ఈ విషయమై శానిటేషన్ విభాగం సూపర్‌వైజర్ రవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేస్తున్నామన్నారు. కాంప్లెక్స్ రోడ్డులో నీరు ప్రవహించే పరిస్థితి లేకపోవడం వల్ల చెత్త నిలిచిపోతున్నప్పటికీ ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని చెప్పారు. కాలువల్లో నీరు సజావుగా పారడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను లేఖ ద్వారా కోరినట్టు ఆయన తెలిపారు.

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం

-మావూరి రవికుమార్, ఉడ్‌పేట



కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల వచ్చే దుర్వాసనలను భరించలేక ఇబ్బందులు పడుతున్నాం. దీనికితోడు కాలువల్లో వ్యర్థాలు వేయడం వల్ల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. దోమల బెడద కూడా అధికం కావడంతో రోజూ దోమల నివారణకు చక్రాలు వాడుతున్నాం. ఈ సమస్యపై అధికారులు తక్షణమే దృష్టిసారించాలి.

మేలు జాతి పాడి పశువులతో రైతుకు ఆదాయం

▸▸ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మోహనరావు

సబ్బవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మేలు జాతి పాడి పశువులే రైతుకు ఆదాయాన్ని ఇస్తాయని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.మోహనరావు అన్నారు. మండలంలోని నారపాడు గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలం నలు మూలల నుంచి 40 లేగ దూడలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిగా కరణం అచ్చియ్యమ్మ, ద్వితీయ బహుమతి మామిడి శంకరరావు, తృతీయ బహుమతి మామిడి ముత్యాలు గెలుచుకున్నారు. విజేతలకు జిల్లా అధికారి డాక్టర్ మోహనరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల ఎంపికలో రైతులు దృష్టిసారించి మేలు జాతి పశువులను కొనగోలు చేయాలని సూచించారు. మేలుజాతి ఆవులు నుంచి మేలు జాతి పెయ్యిలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన చెప్పారు. మేలు జాతి పెయ్యిలను అభివృద్ధి చేసి, ఇతర రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఆయన సూచించారు. అనంతరం జరిగిన ఉచిత పశు ఆరోగ్య శిబిరంలో 50 దూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. 55 పశువులకు గర్భకోశ, చూడి పరీక్షలు చేసి, పాడి రైతులకు అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడి శంకరారవు, డాక్టర్ ఎస్.స్వర్ణలత, డాక్టర్ జి.అరుణ, డాక్టర్ బి.సంధ్య, డాక్టర్ ఎస్.సౌజన్య, జేవీవో.రమణారావు, వీఏ సంధ్య, పశు సంవర్ధక శాఖ సహా సహాచకులు కె.లక్ష్మణరావు, శ్రీనివాసరావు, అరుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో ఉంచిన లేగదూడలను పరిశీలిస్తున్న డాక్టర్ మోహనరావు

మెట్రో కెమ్ ఫార్మా ప్రభావంపై విచారణ చేపట్టాలి

▸▸ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ ఫార్మా కంపెనీలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రతా ప్రమాణాలను పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది నవంబరు రెండో తేదీన ఇదే పరిశ్రమలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై ప్రభుత్వాలు చర్యలు చేపట్టకపోవడం వల్ల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మెట్రోకెమ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు, పక్కన నాయకులు

ఫార్మా ప్రమాదంపై విచారణకు సీపీఎం డిమాండ్

పరవాడ: ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ (ఏపీఐ) పరిశ్రమలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, కార్యవర్గసభ్యుడు జి.కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన పరిశ్రమను సందర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను గాలికొదిలేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భద్రత ప్రమాణాలు పాటించడంలో యాజామాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి చేతులు దులుపేసుకోవడం అలవాటుగా మారిందన్నారు. ప్రమాదాలు జరిగే పరిశ్రమల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయలని వారు డిమాండ్ చేశారు.

మెట్రో కెమ్ ప్రమాదంపై కలెక్టర్ విచారణ

అనకాపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పరవాడ ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన భారీ అగ్నిప్రమాదంపై కలెక్టరు విజయకృష్ణన్ విచారణకు ఆదేశించారని జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ జి.నాగరాజరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈటీపీ ట్యాంకు టెర్రస్ ఏరియాలో మంటలు చెలరేగి, హెచ్‌డీపీ డ్రమ్ములకు వ్యాపించాయని, ఈ ప్రమాదంలో కార్మికులెవరూ గాయపడలేదని పేర్కొన్నారు. మంటలు వ్యాపించిన 15 నిమిషాల్లోనే అంతర్గత అగ్నిమాపక పరికరాలతో అదుపు చేశారని తెలిపారు. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల తీర్థం

పరవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిబ్బల గొర్లివానిపాలెంలో మంగళవారం సీతారాముల తీర్థ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు సీతారాములను దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. సాయంత్రం తీర్థంలో ఏర్పాటు చేసిన కోలాటం, సాముగరిడిలు, చిడతలు, చిటికెల భజనలు కనువిందు చేశాయి. అలాగే నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


తీర్థ మహోత్సవంలో మహిళా భక్తులు నిర్వహిస్తున్న కోలాటం

బాబోయ్ క్వారీ లారీలు..!

ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు... భయాందోళనలో పట్టణ ప్రజలు


తుమ్మపాల మెయిన్ రోడ్డుపై పడి ఉన్న భారీ బండరాలను తొలగిస్తున్న యువకులు

తుమ్మపాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-చోడవరం రహదారిలో క్వారీ లారీలు ప్రజలను భయపెడుతున్నాయి. వాహనాలను డ్రైవర్లు భారీ లోడ్లతో అతి వేగం, ఇష్టారాజ్యంగా తమ వాహనాలను నడుపుతూ రోడ్లపై ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నారు. నడుపుతుండడంతో సాగిస్తున్నాయి.

మార్టూరులో ఒక క్వారీ నుంచి భారీ రాళ్ల లోడుతో మంగళవారం ఓ లారీ అనకాపల్లి వైపునకు వేగంగా వస్తున్న వస్తున్నది. తుమ్మపాల వద్ద లారీలో నుంచి పెద్ద పెద్ద బండ రాళ్లు జారిపడ్డాయి. దీంతో అదే రోడ్డులో ప్రయాణిస్తున్న వారు భయకంపితులై పరుగులు తీశారు. వెంటనే స్థానికంగా ఉన్న కొంత మంది యువకులు పరిగెత్తి వెళ్లి లారీని ఆపి డ్రైవర్‌తో గొడవకు దిగారు. అలాగే ఫోన్‌లో అధికారులకు సమాచారమిచ్చారు. రోడ్డుపై చిందర వందరగా పడిన భారీ రాళ్లను రోడ్డు పక్కకు తొలగించి రాకపోకలకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు. మైన్స్, రవాణా, పోలీస్ శాఖ అధికారులు దృష్టిసారించి ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్న లారీ డ్రైవర్లు, క్వారీ, క్రషర్ల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అంతా డిమాండ్ చేస్తున్నారు.

తేగాడలో 20 పశువులకు గర్భకోశ చికిత్సలు

కశింకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేగాడ రైతు సేవా కేంద్రం వద్ద జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 20 పాడి పశువులకు పశు వైద్యాధికారి అల్ఫోన్స జార్జ్ గర్భకోశ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు పోషకాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యనిస్తున్నదని చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 16 పశువులు, 20 పెయ్యలు, 500 మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 41 మంది పశు పోషకులు పాల్గొన్నారు.

ఈ.బోనంగిలో పశువైద్య శిబిరం

పరవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ.బోనంగి పంచాయతీ కేంద్రంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాడచీపురుపల్లి పశు వైద్యాధికారి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పశువైద్య సిబ్బంది నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ టెక్నికల్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు

కశింకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ టెక్నికల్ ఆఫీసర్‌గా సెయింట్ జాన్స్ స్కూలుకు చెందిన పీఈటీ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఎంపికయ్యారని స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఫస్ట్ ఖో-ఖో వరల్డ్ కప్ ఆఫ్ ఇండియాలో ప్రపంచంలో 34 దేశాలు పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు మాత్రమే ఎంపికయ్యారని చెప్పారు. వీరిలో ఒకరిగా ఎంపికైన శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపానంది, అకడమిక్ ఇన్‌చార్జి, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారాతో మహిళ అరెస్టు

కశింకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం గ్రామ శివారులో నాటుసారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మన్నాయుడు తెలిపారు. మంగళవారం తమకు మందుస్తుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ కేఎస్.గణేశ్, సిబ్బంది వెళ్లి పరిశీలించగా బత్తిన లక్ష్మి అనే మహిళ పట్టుబడిందన్నారు. ఈ మేరకు ఆమె నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ప్రొహిబిషన్ చట్టం 1995 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

కూండ్రంలో పొలం పిలుస్తోంది..

కొత్తూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూండ్రం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పీబీ రంగాచారి చెరకు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మినుములు, నువ్వులు, పెసలు, ప్రొద్దుతిరుగుడు, చోడి పంటలపై అవగాహన కల్పించారు. అలాగే నూనె గింజలు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సహాయకుడు సంతోశ్, రైతులు పాల్గొన్నారు.

పుణ్య ఫలదాయకం

త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం

- మహా కుంభమేళాకు భారీగా తరలివెళ్తున్న భక్తులు
- ఉత్తరాంధ్ర నుంచి రెండు లక్షల మంది వెళతారని అంచనా
- ఇప్పటికే 20 వేలమందికి పైగా పయనం





విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ మేళా. ఈ నెల 13న ప్రారంభమైన మేళా వచ్చే నెల 26 వరకు జరగనుంది. ప్రతిరోజూ లక్షలాది భక్తులు పుణ్యస్నానాలను ఆచరిస్తున్నారు. కుంభమేళాకు ఉత్తరాంధ్ర నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. ప్రయాగ్‌రాజ్ చేరేందుకు రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులో ఉంచింది. గత వారం రోజుల్లో ఈ జిల్లా ల నుంచి 20 వేల మందికిపైగా భక్తులు మేళాకు వెళ్లినట్లు అంచనా. ఇంకా 35 రోజుల సమయం ఉండడంతో సుమారు మరో రెండు లక్షల మంది వెళతారని భావిస్తున్నారు.

- విశాఖ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు నడుస్తున్న రైళ్లు
- వచ్చేనెల 19 వరకు నిండిపోయిన బెర్తులు
- సంగమ ప్రదేశాల్లో ఏర్పాట్లపై సర్వత్రా సంతృప్తి

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశేష ప్రాధాన్యముంది. సాధారణ ప్రజలతో పాటు నాగ సాధువులు, అఘోరాలు ఇక్కడ పుణ్య స్నానాలను ఆచరిస్తున్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానం చేస్తే జన్మ పునీతమవుతుందన్నది భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు ఆచరిస్తున్నారు.

ఇదీ చరిత్ర..

మహా కుంభమేళా విశిష్టతను చాటిచెప్పే ఇతివృత్తాలు ఎన్నో ఉన్నాయి. అమృతం కోసం దేవతలు, రాక్షసులు చేసిన క్షీరసాగర మదనానికి, కుంభమేళాకు సంబంధం ఉంది. క్షీర సాగర మదనం అనంతరం వెలువడిన అమృత భాండం రాక్షసులకు చిక్కకుండా మహా విష్ణువు మోహిని అవతారంలో తీసుకువెళ్తుండగా నాలుగు చుక్కలు హరిద్వార్, ప్రయాగ్‌రాజ్, ఉజ్జయిని, నాసిక్ క్షేత్రాల్లో పడ్డాయని చెబుతారు. ఈ నేపథ్యంలో వాటికి మహత్యం సిద్ధించిందని, ఈ క్షేత్రాల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తే పునీతులువుతారని ప్రతీతి. గ్రహ భ్రమణాలను అనుసరించి 12 ఏళ్లకు ఒకసారి ఆయా చోట్ల మహా కుంభమేళా నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం జరుగుతున్న మహా కుంభమేళాకు మరింత ప్రత్యేకత ఉంది. 144 ఏళ్లకు ఒకసారి మాత్రమే ఈ మేళా నిర్వహిస్తారు. ఇది 12 పూర్ణ కుంభమేళాలతో సమానం. దీనిని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించ చడం ఆనవాయితీ.

స్నానానికి ప్రాధాన్యం..

కుంభమేళాలో చేసే పవిత్ర స్నానానికి ప్రాధాన్యం ఉంది. శుభ సమయాల్లో గ్రహాలు, నక్షత్రాల సంగమం పవిత్రజలంలో చేరుతుంది. ఈ సమయంలో స్నానాలు చేసిన వారికి ఆ అనుగ్రహం లభిస్తుంది. ఆరోగ్యం, ఐశ్వర్యంతో సహా ఎన్నో సత్ఫలితాలు లభిస్తాయని విశ్వాసం. కుంభమేళా స్నానాల్లో అత్యంత పవిత్రమైనది రాజస్నానం. ఈ నెల 13న పుష్యమి రోజు తొలి రాజస్నానం, 14న మకర సంక్రాంతి రోజు రెండో స్నానం జరిగాయి. ఈ నెల 29న మౌని అమావాస్య రోజున మూడో రాజస్నానం, ఫిబ్రవరి మూడున వసంతి పంచమి రోజున నాలుగో రాజస్నానం, ఫిబ్రవరి 12న మాఘపౌర్ణమి సందర్భంగా ఐదో రాజస్నానం, ఫిబ్రవరి 26న మహా శివరాత్రి రోజున చివరి రాజ స్నానం చేస్తారు. ఆయా రోజుల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. తొలి రాజస్నానం రోజున సుమారు మూడు కోట్ల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

చేరుకోవడం ఇలా..

విశాఖ నుంచి రైలు, విమాన మార్గంలో హైదరాబాద్, ఢిల్లీకి వెళ్లి, అక్కడి నుంచి ప్రయాగ్‌రాజ్ చేరుకోవచ్చు. ప్రయాగ్‌రాజ్ నుంచి పుణ్య స్నానాలు ఆచరించే (మహా కుంభ మేళా జరుగుతున్న ప్రదేశం) త్రివేణీ సంగమానికి (ఆరు కిలోమీటర్లు) చేరుకునేందుకు రైల్వేస్టేషన్‌లోని పోలీసు సిబ్బంది సహకరిస్తారు. మూడు కిలోమీటర్లు వరకు సాధారణ వాహనాల్లో చేరుకోవచ్చు. మిగిలిన మూడు కిలోమీటర్లు ఇ-రిక్షాల్లో వెళ్లాల్సి ఉంటుంది. లేదంటే జంక్షన్ నుంచి నేరుగా బైక్ ట్యాక్సీల్లో చేరుకోవచ్చు. ఇందుకు రూ.100 చొప్పున వసూలు చేస్తారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరే భక్తులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చలి తీవ్రత ఎక్కువ. కాబట్టి ఉన్ని వస్త్రాలు వెంట ఉంచుకోవాలి. దుప్పట్లు తప్పనిసరి. కుంభమేళా జరుగుతున్న ప్రాంతాల్లో ఉచిత టెంట్‌లు అందుబాటులో ఉంటాయి. బెడ్‌తో కూడిన కొన్ని టెంట్‌లు అద్దెకు లభిస్తాయి.

ఆహారం, నీటి వసతి ఉంది. పుణ్యస్నానాలు తరువాత నేరుగా ప్రయాగ్‌రాజ్‌కు చేరితే అక్కడ హోటల్స్ ఉంటాయి. ప్రయాగ్‌రాజ్ జంక్షన్ నుంచి వారణాసి వంద కిలోమీటర్లు. ఇక్కడి నుంచి 20 కిలో మీటర్ల దూరంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్ ఉంటుంది. ఇక్కడకు ప్రయాగ్‌రాజ్ నుంచి స్పెషల్ ట్రైన్ వస్తుంది. దాంట్లో విశాఖ చేరు కోవచ్చు. లేదా ప్రయాగ్‌రాజ్‌లో నుంచే తిరుగుప్రయాణమయ్యే వీలుంది.

పూర్వ జన్మ సుకృతం



మహా కుంభమేళాలో పుణ్యస్నానం చేయడం పూర్వ జన్మ సుకృతం. ఈ అదృష్టం వస్తుందని ఊహించలేదు. ఢిల్లీ వరకు విమానంలో వెళ్లి అక్కడి నుంచి రైలులో ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నాం. ప్రయాణానికి రెండు వైపులా 30 గంటల చొప్పున పట్టింది. అక్కడ ఒకరోజు ఉన్నాం. ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. కోట్లాది మంది భక్తులు వస్తున్నారని భయపడాల్సిన అవసరం లేదు. ప్రశాంతంగా పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ సిబ్బంది అడుగడుగునా సహకరిస్తున్నారు.

\- ఎం.వెంకటరావు, ధర్మశీల, విశాఖపట్నం

స్నానాలతో మరింత పుణ్యం



వృషభరాశిలో గురుడు, మకర రాశిలో రవి ఉన్న సమయం కావడంతో మహా పుణ్యకాలం. ఈ నెల 13 నుంచి వచ్చే నెల 26 వరకు ఉంటుంది. అందుకే మహా కుంభ మేళా నిర్వహిస్తున్నారు. ఈ కాలంలో త్రివేణి సంగమంలో స్నానాలను ఆచరిస్తే ఎంతో పుణ్యం పొందవచ్చు. ఈ నెలాఖరులో మాఘమాసం వస్తోంది. ఆ రోజుల్లో స్నానం చేస్తే మరింత ఫలం. అందుకే కోట్లాది భక్తులు వెళుతున్నారు. త్రివేణి సంగమంలో దానాలు, పితృ కర్మలు చేసినా ఫలిస్తాయి.

\- భోగారపు వాయునందన శర్మ, జయ కామాక్షి వైభవ పంచాయతన పీఠం

ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి

- ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలం ముత్యాలమ్మ పాలెం సముద్ర తీరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభ 377 నిబంధన కింద చర్చించిన అంశాన్ని సంబంధిత శాఖకు పరిశీలన నిమిత్తం పంపాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖామంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు లేఖ రాసినట్టు ఆయన తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ ద్వారా వివిధ ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి 'స్వదేశ దర్శన్' (ప్రసాద్) కింద చేపట్టే ప్రయత్నాలలో భాగంగా ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్టు ఎంపీ తెలిపారు.

సుద్దాల అశోక్ తేజకు 'వేటూరి' పురస్కారం

పాయకరావుపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ గీతాల రచయిత, సాహిత్యకారుడు సుద్దాల అశోక్ తేజకు ఈ ఏడాది వేటూరి పురస్కారం అందజేయనున్నట్టు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వరశర్మ, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. పట్టణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రామజోగేశ్వరశర్మ మాట్లాడుతూ సినీ, సాహితీరంగ ప్రముఖులకు గత పదమూడేళ్లుగా ఏటా ఈ పురస్కారం ఇచ్చి సత్కరిస్తున్నామన్నారు. సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 29న వేటూరి జయంతి సందర్భంగా తుని చిట్టూరి మెట్రోలో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి సాహితీ ప్రియులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

సబ్ జూనియర్ బాలికల హాకీ జిల్లా జట్టు ఎంపిక రేపు

ఎలమంచిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలికల హాకీ టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 23న ఎలమంచిలి రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్టు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొరారు నరేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణులు ఆధార్ కార్డుతో హాజరు కావాలని తెలిపారు. అనంతపురంలో ఈ నెల 27 నుంచి 29 వరకు అంతర్ జిల్లాల టోర్నీ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సమర్థంగా పనిచేశాననే సంతృప్తితో వెళుతున్నా...

... 5వ పేజీ తరువాయి

రెండేళ్లలో జీవీఎంసీ పరిధిలో శతశాతం తారురోడ్లు ఉండేలా ప్రణాళికలు తయారుచేశామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా జీవీఎంసీని మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రతి జోన్‌లో టౌన్ లెవల్ ఫెడరేషన్స్ (టీఎల్ఎఫ్) ద్వారా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులు విక్రయించేలా దుకాణాలు కేటాయించి వారికి రుణసదుపాయం కల్పించడంతోపాటు వ్యాపారులకు వస్తువులు సరఫరా చేసేందుకు వీలుగా రవాణా సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్-2025లో దేశంలోనే ఒకటి, రెండు ర్యాంకులను సాధించేందుకు వీలుగా నగరాన్ని అన్ని రంగాల్లోనూ సన్నద్ధం చేశామన్నారు. దేశంలోనే ఉత్తమ నగరంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన అర్హత విశాఖకు ఉందని సంపత్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

పల్లె పండుగ పనులు వేగవంతం

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేయాలన్నారు. అనంతరం గృహ నిర్మాణ సంస్థ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, లక్ష్యాలకు అనుగుణంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆయా సమీక్షా సమావేశాల్లో పంచాయతీరాజ్ శాఖ ఈఈ కే వీరన్నాయుడు, డివిజనల్ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు, డ్వామా పీడీ పూర్ణిమదేవి, పీఆర్ ఈఈ వీరన్నాయుడు, పశుసంవర్థక శాఖ అధికారి రామ్మోహన్‌రావు, గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు, డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

సబ్ జైలులో వసతులపై ఆరా

- పరిశీలించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారిణి, సీనియర్ సివిల్ జడ్జి



జైలు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.శేషమ్మ, పక్కన ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ

ఎలమంచిలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సబ్ జైలును మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారిణి ఎం.శేషమ్మ, ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ సందర్శించారు. జైలులోని నిందితుల వివరాలు తెలుసుకుని వారితో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. జైలు పరిసరాలను పరిశీలించి జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈనెల రెండో తేదీ నుంచి నిలిపివేసిన అప్పన్న ఆర్జిత సేవలను మంగళవారం పునఃప్రారంభించారు. ఇందులో భాగంగా వేకువజామున 4 గంటలకు సుప్రభాతసేవ, 4.30 గంటలకు ప్రభాత ఆరాధన, ఉదయం 8 గంటలకు గురుడసేవ, ఉదయం 8.30, సాయంత్రం 5.30 గంటలకు సహస్రనామార్చన, ఉదయం 9.30 గంటలకు నిత్య కల్యాణం, రాత్రి 7 గంటలకు ఆరాధన. ఉదయం 7 నుంచి రాజభోగం వరకు లక్ష్మీనారాయణుల వ్రతాలు, స్వర్ణ పుష్పార్చన, స్వాతి హవనం వంటి సేవలన్నీ యధావిధిగా జరుగుతాయని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి నిత్య కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఐఎంయూ నిర్వాసిత రైతుల ఆందోళన విరమణ

- ఎమ్మెల్యే పంచకర్ల సమక్షంలో యాజమాన్యం హామీ
- 10 డిమాండ్లు పరిష్కరించేందుకు అంగీకారం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలి గ్రామంలో ఇండియన్ మారిటైం యూనివర్సిటీ(ఐఎంయూ) ఎదుట గత నాలుగు రోజులుగా నిర్వాసిత రైతులు చేపడుతున్న ఆందోళనను మంగళవారం విరమించారు. ధర్నా శిబిరాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సందర్శించి రైతుల తరపున వర్సిటీ డైరెక్టర్ కేశవదేవ్‌తో చర్చించారు. రైతులు యాజమాన్యం ముందు ఉంచిన హౌస్ కీపింగ్, గార్డెనింగ్, కేంటీన్ నిర్వహణ, వాచ్‌మన్, తదితర ఉద్యోగాలతో కూడిన 12 డిమాండ్లు పెట్టారని, ఇందులో 10 డిమాండ్లు పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. అయితే రాతపూర్వక హామీ ఇచ్చేందుకు సాంకేతిక కారణాల దృష్ట్యా 15 రోజులు గడువు అడిగినట్టు రైతులకు ఎమ్మెల్యే వివరించారు. 15 రోజుల తరువాత రాత పూర్వకంగా హామీ ఇవ్వకుంటే రైతులు ఆందోళన చేసుకోవచ్చునన్నారు. రెండు డిమాండ్లలో ఒకటి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఉందని, ఈ హామీ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇచ్చిందన్నారు. ఈ హామీ వర్సిటీ పరిధిలోనిది కానందున కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. వంగలి మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం బాధ్యతతో పాటు గ్రామాన్ని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వర్సిటీ నుంచి గ్రామాభివృద్ధికి రూ.3 కోట్లు డిమాండ్ ఒకటి ఉందని, అంతకాకున్నా కోటిన్నర రూపాయలు ఇస్తే ప్రభుత్వ నిధులకు మ్యాచింగ్ గ్రాంటుగా వినియోగించి గ్రామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే పక్కనే నిర్మాణంలో ఉన్న పెట్రో వర్సిటీ నుంచి కూడా రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులు హర్షం వ్యక్తం చేసి ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ వి.కేశవదేవ్, జనసేన నాయకులు ఇందలి వెంకటరమణ, సర్పంచ్ ఆకులు శ్రీహేమ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, సీఐ పిన్నింటి రమణ, రైతులు, గ్రామ పెద్దలు, ఉప సర్పంచ్ గొర్లి అప్పలనాయుడు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఖాళీగా ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పోస్టు

- దాంతో పాలిటెక్నిక్ కాలేజీ సిబ్బందికి నాలుగు నెలలుగా అందని జీతాలు

విశాఖపట్నం/అనకాపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్) పరిధిలోని రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదు. ఆర్ఈసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జి ఎవరూ లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఆర్ఈసీఎస్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో దానిని మూడేళ్ల క్రితం ఈపీడీసీఎల్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పాలిటెక్నిక్ కళాశాల ఒకటి ఉందని, దానికి ఆర్ఈసీఎస్ నుంచే జీతాలు ఇస్తున్నారనే విషయం ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకువెళ్లలేదు. దాంతో ఈపీడీసీఎల్ అధికారులు కేవలం విద్యుత్ శాఖకు సంబంధించిన సిబ్బందికే జీతాలు ఇస్తున్నారు. ఆర్ఈసీఎస్‌కు సహకార శాఖ నుంచి ఎండీ, పర్సన్ ఇన్‌చార్జిని ప్రభుత్వం నియమించడంతో ఆ హోదాలో పనిచేసిన ఎం.శ్యామల లేఖ రాసి ఈపీడీసీఎల్ నుంచి కళాశాల సిబ్బందికి జీతాలు ఇప్పించేవారు. నాలుగు నెలల క్రితం ఆ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పూర్తయిపోయింది. దాంతో ఆ అధికారిణి రిలీవ్ అయిపోయారు. ఈపీడీసీఎల్‌కు లేఖ రాసేవారు ఎవరూ లేకుండాపోయారు. మూడు వారాల క్రితం ప్రభుత్వం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించింది. ఏ కారణాల చేతనో ఆమె బాధ్యతలు తీసుకోలేదు. దాంతో ఆ పోస్టు ఖాళీగా ఉండడం వల్ల పాలిటెక్నిక్ కాలేజీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు.

రాజీవ్‌గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కాలేజీని 2009లో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అందులో 504 మంది విద్యార్థులు ఉండగా 51 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారికి సగటున ఒక్కొక్కరికి రూ.30 వేల జీతం ఇవ్వాల్సి ఉంటుంది. నెలకు రూ.15 లక్షలు అవసరం. గత ఏడాది సెప్టెంబరు నుంచి వారికి జీతాలు లేవు. తక్షణమే తమకు జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఏవోబీపై చలపతి ముద్ర

... 5వ పేజీ తరువాయి

అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో హుకుంపేట మండలం బాకూరుకు చెందిన బాకూరి వెంకటరమణ అలియాస్ ప్రసాద్, అగ్రనేత ఆర్కే కుమారుడితోసహా 32 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ సంఘటన తరువాత ఏవోబీపై పోలీసులు పట్టుసాధించారు. కేంద్ర బలగాలతోపాటు రాష్ట్ర పోలీసు బలగాలు గాలింపులను ముమ్మరం చేశాయి. దీంతో ఏవోబీలోని మావోయిస్టు నేతల్లో అత్యధికులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి అక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారు. వీరిలో చలపతి కూడా ఉన్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులోని గరియాబంద అటవీ ప్రాంతంలో ఇరు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు సమావేశమయ్యారని తెలుసుకున్న యాంటీ నక్సల్స్ ఆపరేషన్ బలగాలు ఆదివారం రాత్రి కూంబింగ్ చేపట్టి, సోమవారం మావోయిస్టులు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టినట్టు తెలిసింది. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు మృతిచెందగా వారిలో చలపతి కూడా ఉన్నారు. ఆయన సహచరి చైతన్య అలియాస్ అరుణ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

పోలీసుల అదుపులో కోడి పందేల రాయుళ్లు

నాతవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం గన్నవరం సమీపంలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు. వీరి నుంచి రెండు కోడిపుంజులు, 430 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో కోడి పందేలు ఆడేవారిపై నిఘా పెట్టామని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్రైం... crime news

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



వర్రె వర్షిత (ఫైల్‌ఫొటో)

నర్సీపట్నం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ అయ్యన్నకాలనీలో ఓ ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి పట్టణ సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయ్యన్నకాలనీకి చెందిన వర్రె నర్సింగరావు, స్వర్ణ కుమారిల చిన్న కుమార్తె వర్షిత(19) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో బాగానే మాట్లాడింది. కొద్ది సేపటి తర్వాత సెల్‌ఫోన్ పట్టుకొని గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఎంతకీ గదిలోంచి బయటకు రాకపోయే సరికి కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గట్టిగా తలుపు తట్టారు. తీయకపోయే సరికి బలవంతంగా తలుపులు తెరిచి చూస్తే ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించింది. తండ్రి నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. మృతిరాలి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, అందులోని సమాచారం ఆధారంగా దర్యాప్తు చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాంబిల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంబిల్లి నుంచి వెంకటాపురం వెళ్లే మార్గంలో అప్పన్నపాలెం కాలనీ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అప్పన్నపాలెం కాలనీకి చెందిన లాలం వెంకటేశ్వర్లు(65) రాంబిల్లి నుంచి వెంకటాపురం వైపు బైక్‌పై వెళుతున్నాడు. సాయిబాబా ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బైక్ అతనిని ఢీకొంది. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని రాంబిల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వృద్ధుడు మృతి చెందాడు. మృతుని కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

వాయిదాపడింది. ఈ దశలో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిపారు. గోవాడ షుగర్స్ సమస్యలపై ఆర్థిక మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి పరిస్థితిని వివరించి, ప్రభుత్వం నుంచి ఫ్యాక్టరీకి ఆర్థిక భరోసా లభించేలా కృషిచేస్తామని చెప్పారు. దీనితో కార్మికులు సమ్మె విరమించి మూడు రోజుల క్రితం విధుల్లో చేరారు. దీంతో మంగళవారం నుంచి రెగ్యులర్ క్రషింగ్‌కు ఏర్పాట్లు చేశారు. కాగా ఈ ఏడాది లక్షా 30 వేల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, చెరకు రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించడానికి చర్యలు చేపట్టామని ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509